# మానవీయ సేవలకు జీవితాన్ని అంకితం చేసిన అమ్మ - మదర్ థెరిసా

## (26 ఆగస్టు "మదర్ థెరిసా జయంతి" సందర్భంగా)

అమ్మ అంటే త్యాగం. అమ్మ అంటే నమ్మకం. అమ్మ అంటే కరుణ. అమ్మ అంటే అనంతమైన ప్రేమ. కన్న తల్లి బిడ్డల కడుపు చూస్తుంది. అమ్మ చేతి స్పర్శ విశ్వాసాన్ని కూర్చే ఔషధం. ప్రేగు బంధం పెనవేసుకున్న అమ్మకు మించిన దైవం లేదు. అమ్మ హస్తం అమృత తుల్యం. కన్న తల్లి ప్రేమను కురిపించడం సర్వసాధారణం. అమ్మ కాని అమ్మలు కూడా తల్లిని మరిపించి, సకల సపర్యలు చేస్తే అదో అద్భుతం, కనివిని ఎరుగని విశేషం. అవసరార్థులు, ఆకలితో అలమటించే అభాగ్యులు, తీవ్ర రోగాల బారిన పడి జీవచ్ఛవంలా బతుకులను ఈడుస్తున్న కడు పేదలకు తానే కన్న తల్లిగా మారి, సకల సపర్యలు చేసి, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడగలగడం ఆమెకే సొంతం. ఆమె జీవితం అవసరార్థులకే అంకితం. ఆమె ఓ ప్రపంచ శాంతిదూత, ఓ ఆపన్నహస్తం, స్వచ్ఛంద నేస్తం. ఆమె ఎవరో కాదు పేరులోనే తల్లిని ఇముడ్చుకున్న మహోన్నత మహిళ, మదర్ థెరిస్సా.

### మానవీయ సేవలకు ప్రతిరూపం మదర్ థెరిసా:

26 ఆగస్టు 1910 పుణ్య గడియల్లో స్కోప్జీ, మర్సిడోనియాలో జన్మించిన మదర్ థెరిస్సా అసలు పేరు "అగ్నెస్ గోంక్షహ బొజాక్సిహివూ". ఆమె 27 ఆగస్టు రోజున బాప్టిజమ్ స్వీకరించడం జరిగింది. చిన్నారి చిన్నతనంలా నుంచే మిషనరీల్లో సేవలు చేయడం ప్రారంభించింది. అవసరార్థులు, అనాథలు, దీర్ఘకాలిక రోగులకు సేవలు చేయడానికి 1928లో ఇంటిని వదిలి 'సిస్టర్స్ ఆఫ్ లొరెటో'లో చేరి ఇండియాలో సేవలు అందించడానికి అంకితం అయి పోయింది. నన్స్ విభాగంలో శిక్షణ అనంతరం కలకత్తాలోని పాఠశాలలో టీచర్‌గా 1931 నుంచి 1948 వరకు సేవలు అందించింది. ఈ కాలంలో పేదరికాన్ని చూసి చలించిపోయి, శాశ్వతంగా సేవామార్గాన్ని నిర్ణయించుకుంది. 1950లో "మిషనరీస్ ఆఫ్ చారిటీ, కలకత్తా"ను ఏర్పాటు చేసి ఒక సమూహాన్ని ఏర్పరచుకొని మురికి వాడడల్లో మగ్గుతున్న కడు పేదలకు స్వచ్ఛందంగా సేవలు చేయడం, విద్య బోధించం, ఆకలి తీర్చడం, రోగులకు ఉపశమన సేవలు చేయడం ప్రారంభించింది. తను నిర్మించిన మిషనరీ సామ్రాజ్యం 130కి పైగా దేశాలకు విస్తరించి లక్షలాది సేవకులకు కేంద్రంగా మారింది. ఇండ్లు లేని వీధి బాలలకు తానే అమ్మగా మారి సకల సపర్యలు చేసి, మానవతకు నిలువెత్తు రూపంగా నిలిచింది.

### మదర్ థెరిసా పొందిన అవార్డులు2:

మథర్‌కు ఎన్ని ప్రశంసలు ఇచ్చినా తక్కువే. ఆమె చేసిన అమూల్య సేవలకు సరిసమాన కొలమానాలు, బహుమతులు, గుర్తింపులు లేవు. అయినప్పటికీ ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, పౌర సమాజం స్పందించి ఆమెకు అనేక అవార్డులు అందించారు. భారత ప్రభుత్వ పద్మశ్రీ, బాస్టవన్ గుడ్ యమరిటన్, జాన్ పోప్ శాంతి బహుమతి, కెన్నెడీ అవార్డు, జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ పురస్కారం, గౌరవ డాక్టరేట్, నొబెల్ శాంతి బహుమతి, భారత రత్న, ప్రసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్, అమెరికా గౌరవ పౌరసత్వం, కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్ లాంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఎన్నో ఆమెను వరించాయి.

ఐదు భాషల్లో అనర్గళంగా మాట్లాడగల మదర్ థెరిసా 1979లో నోబెల్ శాంతి పురస్కారాన్ని అందుకొని 2015లో పోప్ ఫ్రాన్సిస్ చేత "సేయింట్ థెరిసా ఆఫ్ కలకత్తా"గా గుర్తించబడింది. 05 సెప్టెంబర్ 1997 రోజున అమరత్వం పొందింది మథర్ థెరిసా. ఆమె వర్ధంతిని "అంతర్జాతీయ చారిటీ దినం"గా పాటించడం జరుగుతున్నది. పలు దేశాల్లో థెరిసా పేరున సంస్థలు, వీధులు, యూనివర్సిటీ, కాలేజీలు, పాఠశాలలు కూడా నెలకొల్పడం జరిగింది. మానవీయ సేవలకు తన జీవితాన్ని అంకితం చేయడమే కాకుండా లక్షల మంది సేవకుల దళాలను ఏర్పాటు చేసి అమూల్య సేవలను నిరు పేదలకు అందించి, నేటి తరానికి దారి దీపంగా నిలుస్తున్నారు.



-మధుపాళీ
9949700037

# దేశంలో మొదటి జీఎంవో రహిత, విస్తరణానుకూల పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన ఉపరాష్ట్రపతిల

న్యూ ఢిల్లీ, ఆగష్టు 25:ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా ముసునూరులో దేశంలోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన జీఎంఓ రహిత, అధిక విస్తరణ సామర్థ్యం కలిగిన పాప్‌కార్న్ మొక్కజొన్న సంకర జాతి విత్తనాన్ని ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈ రోజు ఆవిష్కరించారు. వ్యవసాయ రంగంలో ఆత్మనిర్భర భారత్ దిశగా ఇదొక కీలకమైన ముందడుగుగా ఆయన అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరో ఏడు రాష్ట్రాలకు చెందిన ఉత్తమ రైతులనూ, 'గౌర్మెట్ పాప్‌కార్న్నికా' 2సంస్థ భాగస్వాములను ఈ సందర్భంగా ఆయన సన్మానించారు.

సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... రైతులే దేశానికి వెన్నెముక అని, భారతదేశ నాగరికతను, సాంస్కృతిక జీవనాన్ని వ్యవసాయమే తీర్చిదిద్దిందని ఉపరాష్ట్రపతి అన్నారు. భారతీయ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో సాంకేతికత, ఆవిష్కరణలు, దేశీయంగా విత్తనాభివృద్ధి ఆవశ్యకతను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

ఈ ఆవిష్కరణ గురించి మాట్లాడుతూ.. నాణ్యమైన పాప్‌కార్న్ మొక్కజొన్న కోసం భారత్ అనేక సంవత్సరాలుగా దిగుమతి చేసుకున్న హైబ్రిడ్ సాంకేతికతపైనే ఆధారపడిందని శ్రీ సి.పి. రాధాకృష్ణన్ చెప్పారు. ఈ నూతన దేశీయ హైబ్రిడ్ విత్తనం వల్ల.. దిగుమతులపై ఆధారపడడం తగ్గుతుందని, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసుకోవడంలో కీలకమైన ముందడుగు అని ఆయన అన్నారు. భారత నేలలో పెరిగే ఈ దేశీయ విత్తనాన్ని అభివృద్ధి చేసి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడే సామర్థ్యాన్ని సాధించిన గౌర్మెట్ పాప్‌కార్న్నికా సంస్థను, రైతులను ఆయన అభినందించారు.

పీఎం-కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన, జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్, నమో డ్రోన్ దీదీ వంటి కేంద్ర ప్రభుత్వ రైతు సంక్షేమ కార్యక్రమాలను ఉపరాష్ట్రపతి అభినందించారు. అలాగే రైతు బజార్లు, ఉద్యాన పంటలు, సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం, రైతులకు దన్నుగా నిలిచే వ్యవస్థలు సహా.. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో దూరదృష్టితో కార్యక్రమాలను చేపడుతున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడిని కూడా ఆయన ప్రశంసించారు.

రైతులు - పరిశ్రమల మధ్య భాగస్వామ్య విస్తృతిని ప్రధానంగా ప్రస్తావిస్తూ.. ఎనిమిది రాష్ట్రాల్లోని 40,000 ఎకరాలలో సాగు చేస్తున్న 17,500 మందికి పైగా రైతులు 'గౌర్మెట్ పాప్‌కార్న్నికా' ప్రయాణంలో భాగమయ్యారని శ్రీ సి.పి. రాధాకృష్ణన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక చిన్న స్థానిక సంస్థగా ప్రారంభమై, నేడు ఒక ప్రధాన పాప్‌కార్న్ మొక్కజొన్న ప్రాసెసింగ్ పరిశ్రమ స్థాయికి దీన్ని తీసుకెళ్లిన శ్రీ ఎస్.బి.పి. పట్టాభి రామారావు, గౌర్మెట్ పాప్‌కార్న్నికా ప్రస్థానాన్ని ఆయన కొనియాడారు. వేలాది రైతు కుటుంబాలకు మెరుగైన మార్కెట్ సదుపాయాలనూ, ఆదాయ అవకాశాలనూ ఇది మరింత బలోపేతం చేసిందని కొనియాడారు.

భూమి నుంచే - అంటే, రైతులు సాగు చేసే నేల, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చేసే విత్తనాలు, ప్రతి ఎకరాలోనూ పటిష్టమయ్యే ఆత్మనిర్భరతల నుంచే.. వికసిత భారత నిర్మాణం సాకారమవుతుందని ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించారు. ఆవిష్కరణలు, పారిశ్రామిక ఆలోచనలు, రైతుల భాగస్వామ్యం కలగలిస్తే.. వ్యవసాయ రంగాన్ని మరింత పటిష్టంగా, ఆత్మనిర్భరగా, అంతర్జాతీయంగా పోటీపడేలా ఎంత అద్భుతంగా తీర్చిదిద్దగలవో చెప్పేందుకు ముసునూరులో చేపట్టిన కార్యక్రమం నిదర్శనమన్నారు.

ఇక్కడికి చేరుకున్న వెంటనే గౌర్మెట్ పాప్‌కార్న్నికా కర్మాగారాన్నీ, శీతలీకరణ గిడ్డంగినీ ఉపరాష్ట్రపతి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులు మొక్కజొన్న ప్రాసెసింగ్, నాణ్యతా నియంత్రణ, ప్యాకేజింగ్, నిల్వ చేసే విధానాలను ఆయనకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మంత్రులు శ్రీ నారా లోకేశ్, శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీ కొలుసు పార్థసారథి, ఇతర ప్రముఖులు, గౌర్మెట్ పాప్‌కార్న్నికా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్ట్

## రూ.1.25 కోట్ల విలువైన 251 కిలోల గంజాయి స్వాధీనం

## ఇతర రాష్ట్రాల్లోని కొనుగోలుదారుల కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు



వరంగల్, ఆగష్టు 25: అంతర్‌రాష్ట్ర గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఓ స్మగ్లర్‌ను దామెర పోలీసులు అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి సుమారు రూ.1.25 కోట్ల విలువైన 251 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రూ.9 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టి యువతను మత్తు బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ ఆధ్వర్యంలో దామెర పోలీసులు చేపట్టిన చర్యల్లో ముదిగొండ నాగేశ్వర్ రావు (55), వులుకుర్తి గ్రామం, దామెర మండలానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రాథమిక విచారణలో అతడు ఒడిశాకు చెందిన కొందరి వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, తన నెట్‌వర్క్ ద్వారా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలువురికి విక్రయించినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు అతడి ఇంట్లో భారీగా నిల్వ ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడి నుంచి గంజాయి కొనుగోలు చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని, గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసీపీ సతీష్‌బాబు, శాయంపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్ఐ వీరభద్రరావు, శాయంపేట ఎస్ఐ పరమేశ్వర్, పరకాల ఎస్ఐ రఘుపతితో పాటు పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

# ఒంటరి మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

## బంబారా గ్రామపంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు అందజేత



ఆదిలాబాద్, ఆగష్టు 25:బంబారా గ్రామపంచాయతీ పరిధిలోని ఒంటరి మహిళలకు తహసీల్దార్ కార్యాలయం ద్వారా విచారణ అనంతరం జారీ చేసిన ఒంటరి మహిళ ధ్రువపత్రాలను గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని తెలిపారు. ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అవసరమైన సహకారం అందిస్తామని సర్పంచ్ బెండారే కృష్ణాజీ పేర్కొన్నారు.

# డిజిటల్ చెల్లింపుల విప్లవంలో 10 ఏళ్లు పూర్తి చేసుకున్న యూపీఐ

న్యూ ఢిల్లీ, ఆగష్టు 25:భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) నియంత్రణలోని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ద్వారా 2016 ఆగస్టు 25న ప్రారంభమైన ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ) పదేళ్లు పూర్తి చేసుకుంది. భారతీయ చెల్లింపుల వ్యవస్థకు ప్రధాన ఆధారంగా, కీలకమైన శక్తిగా యూపీఐ ఆవిర్భవించింది.

దశాబ్దానికి పైగా నిర్వహిస్తున్న కార్యకలాపాల ద్వారా అసాధారణమైన స్థాయిని, వేగాన్ని యూపీఐ ప్రదర్శించింది. వార్షిక లావాదేవీల పరిమాణం 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 1.78 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 24,162 కోట్లకు పైగా లావాదేవీలకు విస్తరించింది. ఇది లావాదేవీల పరిమాణంలో దాదాపు 13,000 రెట్ల పెరుగుదలను సూచిస్తుంది. అలాగే లావాదేవీల విలువ 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.0.07 లక్షల కోట్ల నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారుగా రూ.314 లక్షల కోట్లకు పెరిగింది. ఫలితంగా లావాదేవీల విలువలో 4,000 రెట్లకు పైగా పెరుగుదల నమోదయింది.

భారతదేశ డిజిటల్ ప్రజా మౌలిక వసతులకు (డీపీఐ) సంబంధించి అత్యంత విజయవంతమైన ప్రధానాధారాల్లో ఒకటిగా యూపీఐ ఆవిర్భవించింది.

# జిల్లా స్థాయి షాట్‌పుట్‌లో గోవింద్‌రావుకు ప్రథమ స్థానం

ఆదిలాబాద్, ఆగష్టు 25: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కోర్కొట గోవింద్ రావు అండర్-16 షాట్‌పుట్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ విజయంతో ఆగస్టు 26, 27 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బంబార సర్పంచ్ బెండారే కృష్ణాజీ గోవింద్‌రావును అభినందిస్తూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ గోవింద్‌రావు ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాడే సంతోష్, పీడీ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు రాంషా, రామచందర్ పాల్గొని అభినందనలు తెలిపారు.

# అక్రమ యూరియా నిల్వలపై దాడులు..

## 600 బస్తాలు స్వాధీనం...నిందితుడి అరెస్ట్

కరీంనగర్, ఆగష్టు 25:అక్రమ యూరియా నిల్వలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లాలోని కాసుల పల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన 600 యూరియా బస్తాలను టాస్క్‌ఫోర్స్, పెద్దపల్లి రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు.

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు మేరకు టాస్క్ ఫోర్స్ ఏసీపీ శ్రీనివాసులు నేతృత్వంలో హకా ఫార్మర్స్ సర్వీస్ సెంటర్‌లో యూరియా బస్తాలను అక్రమంగా నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు దీకొండ రమేష్, లక్ష్మణ్ రావు, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మధుకర్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి కలిసి కాసులపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు.

యూరియా బస్తాలను అక్రమంగా నిల్వచేసిన అడెపు సంపత్ (43), తండ్రి సత్యనారాయణను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 600 యూరియా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో బస్తా బరువు 50 కిలోలు కాగా, ఒక్కో బస్తా విలువ రూ.600 చొప్పున మొత్తం స్వాధీనం చేసుకున్న యూరియా విలువ రూ.3,60,000గా ఉంటుందని తెలిపారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

## సారంగాపూర్‌లో ఘనంగా వనమహోత్సవం



ఆదిలాబాద్, ఆగష్టు 25:కడెం మండలంలోని సారంగాపూర్ గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ కోల తేజస్విని శ్రీనివాస్ ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఐకేపీ వివో భవనం వద్ద సర్పంచ్ కోల తేజస్విని మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో మొక్కల నాటే కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత వహిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. పద్మ, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మార్గపు లక్ష్మణ్, వార్డు సభ్యులు మార్గపు భూలక్ష్మి, కుమ్మరి సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, కారోబారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన 'డాలర్-రూపాయి మార్పిడి' పథకంతో దేశంలోకి భారీగా వస్తున్న విదేశీ మారకద్రవ్యం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 25: భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ఈ ఏడాది జూన్ 8న 'అమెరికా డాలర్ రూపాయి విదేశీ మారకం మార్పిడి' పేరిట ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. 'ఎఫ్‌సీఎన్ఆర్(బి)' డిపాజిట్లు, విదేశీ కరెన్సీ రుణాలు (ఓఎఫ్‌సీబీ), బాహ్య వాణిజ్య రుణాల (ఈసీబీ) రూపంలో దేశంలోకి విదేశీ మారకద్రవ్యం భారీగా రావడంలో ఈ పథకం ఎంతగానో దోహదపడింది. ఈ మేరకు ఆగస్టు 21 నాటికి 73 బిలియన్ డాలర్ల దాకా విదేశీ మారకద్రవ్యం సమీకృతమైంది. ఇందులో 'ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్ల వాటా అత్యధికంగా 65.40 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ పథకంపై ప్రవాస భారతీయుల అద్భుత స్పందనకు ఇదే నిదర్శనం. భారత బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రవాస భారతీయుల విశ్వాసాన్ని ఈ పథకం విజయం ప్రతిబింబిస్తోంది. తదనుగుణంగా వారు తమ పొదుపు నిధులను అంచనాలకు మించి 'ఎఫ్‌సీఎన్ఆర్(బి)' డిపాజిట్లలో మదుపు చేశారు. భారత వృద్ధి ప్రస్థానంపై తమ నమ్మకంతో పాటు ఆర్థిక, భావోద్వేగ అనుబంధాన్ని ఈ విధంగా వారు మరోసారి చాటుకున్నారు. ఈ పథకం విజయంతో దేశీయ ఆర్థిక వ్యవస్థకు ప్రవాస భారతీయుల బలమైన అండ, నిబద్ధత స్పష్టమయ్యాయి.

ఈ పథకం గడువు 12 వారాలు కాగా, మరొక వారం మిగిలి ఉండగానే, 73 బిలియన్ డాలర్ల లక్ష్యం పూర్తికావడం విశేషం. భారత్ చేపట్టిన అతిపెద్ద, అత్యంత వేగవంతమైన విదేశీ మారక సమీకరణ ప్రక్రియకు ఇదొక నిదర్శనంగా నిలిచింది.

## దళిత వర్గాలకు న్యాయం కోసం...

# అట్రాసిటీ కేసుల్లో 41 ఏసీఆర్పీసీ వర్తించకుండా చూడండి

### స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో బాధితులకు అన్యాయం జరిగే అవకాశం
### జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ ను కలిసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్



కరీంనగర్, ఆగష్టు 25: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులకు 41 సి ఆర్ పి సి వర్తించకుండా ఒక న్యాయపరమైన మార్పు కోసం దేశంలో మొదటి సారిగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. దళిత వర్గాల పై దాడులు అవమానకర ఘటనలు భూ వివాదాల సమస్యలపై దళితులు, ప్రత్యర్థులపై అట్రాసిటీ కేసులను నమోదు చేస్తే?అట్రాసిటీ కేసులకు 41 ఏ సి ఆర్ పి సి లో భాగంగా స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో దళిత వర్గాలకు అన్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయని తెలంగాణ ఎస్సీ కమిషన్ భావిస్తుంది.అయితే తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ బృందం మాత్రం ఈ విధానంలో పరిపూర్ణ న మార్పు కోసం న్యాయ పోరాటానికి సిద్ధమయింది.

ఈ నేపథ్యంలో సోమవారం రోజున తెలంగాణ ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నేతృతంలో రాష్ట్ర కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రేణుకుం2ట్ల ప్రవీణ్ , రాంబాబు నాయక్ జిల్లా శంకర్, నిలదేవి బృందం దేశ రాజధాని ఢిల్లీ బయలుదేరింది. జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ ముక్వానా ను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ బృందం కలిసింది. వీరితోపాటు పి ఓ ఏ యాక్ట్ అధ్యక్షులు బిట్ల వెంకటేశ్వర్లు కూడా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అట్రాసిటీ కేసుల్లో ప్రధానంగా 41 ఏ సిఆర్పిసిని వర్తింప చేయకుండా చూడాలని వివరిస్తూ మెమోరాండం అందజేశారు. అలాగే రాష్ట్రంలో దళితులపై జరిగిన దాడుల పరంపర పెండింగ్ కేసుల అంశాలను జాతీయ కమిషన్కు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అట్రాసిటీ కేసులు నమోదు చేసేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసుల వ్యవహారాన్ని జాతీయ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ తో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుల బృందం సమావేశం అయ్యింది. సమావేశం సందర్భంగా 2023 నుండి 2026 ఆగస్టు వరకు అట్రాసిటీ, భూ వివాదాల తోపాటు పలు సమస్యలపై 5867 ఫిర్యాదులు అందినట్లు జాతీయ చైర్మన్కు వివరించారు. ఇదే అంశంపై మంగళవారం రోజున కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్, కేంద్ర సోషల్ జస్టిస్ మంత్రి డాక్టర్ వీరేందర్ కుమార్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తోపాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి సమస్యలను వివరించనున్నట్లు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ తెలిపారు. అదేవిధంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము ను కలిసి సమస్యలను విన్నవించనున్నట్లు కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో కోసం...

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటో చిత్రాన్ని దేశ కరెన్సీ పై ముద్రించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ డిమాండ్ చేస్తుంది. ఈ అంశాన్ని జాతీయ ఎస్సీ కమిషన్కు విన్నవించింది. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటోలు ఏర్పాటు చేసే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ ఎస్సీ కమిషన్ కేంద్ర మంత్రులకు వివరించనున్నట్లు బృందం తెలిపింది.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం..



కరీంనగర్, ఆగష్టు 25:ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మంథని మండలం గంగాపురి వద్ద రూ.2.55 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గంగాపురి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ఉపకేంద్రంతో పరిసర ప్రాంతాలకు నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు, వ్యాపారులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని ఆదేశించారు.

**భూ భారతి ద్వారా భూ సమస్యలకు పరిష్కారం**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం భూ భారతి ద్వారా చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. గతంలో ధరణి వ్యవస్థలో ఏర్పడిన సమస్యలతో రైతులు, భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. భూ భారతి ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి పారదర్శకంగా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూ రీ-సర్వేను దశలవారీగా చేపడుతున్నామని, తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

భూ రికార్డుల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా అధికారులు సమగ్రంగా పనిచేయాలని సూచించారు. ప్రజలు భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చూడాలని, భూ భారతి ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించా లని మంత్రి సూచించారు.విద్యుత్ ఉపకేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించాలని, వ్యవసాయ రంగానికి అవసమైన విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుతాయని మంత్రి, కలెక్టర్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ స్రవంతి రమేష్, జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఆర్డీఓ సురేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌రెడ్డి, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు, న్యాయవాది శశుభూషణ్ కాచే, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, వివిధ శాఖల అధికా రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాతృత్వ శ్రేయస్సు కోసం ఆయుర్వేద ఆధారిత "గర్భిణీ మిత్ర" కోర్సు ప్రారంభించిన ఏఐఐఏ

న్యూఢిల్లీ, ఆగష్టు 25:ఆయుష్ మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేసే స్వయంప్రతిపత్తి సంస్థ అయిన 'అఖిల భారత ఆయుర్వేద సంస్థ' (ఏఐఐఏ) 2026-2027 విద్యాసంవత్సరానికి గాను ''గర్భిణీ మిత్ర'' కోర్సును ప్రారంభించింది. ఈ కార్యక్రమం వ్యవస్థీకృత ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ఓ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం. గర్భిణులకు, బాలింతలకు అవసరమైన వైద్య విద్యను, జీవనశైలికి సంబంధించిన మార్గదర్శకత్వాన్ని, సాముదాయిక స్థాయి సహాయాన్ని అందించగలిగే సిబ్బందిని తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ లక్ష్యం.

ఈ కోర్సును సాంప్రదాయిక ఆయుర్వేద భావనలైన 'గర్భిణీ పరిచర్య' (మహిళ గర్భంతో ఉన్న కాలంలో ఆమె సంరక్షణ), 'నూతిక పరిచర్య' (కాన్పు అనంతరం సంరక్షణ), 'గర్భాదాన విధి' (గర్భధారణకు పూర్వం సంరక్షణ).. ఈ అంశాల ఆధారంగా రూపొందించారు. ఈ కోర్సును ఆరు నెలల పాటు సోమవారం మొదలు శుక్రవారం దాకా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ మాధ్యమంలో బోధించేలా రూపొందించారు. మహిళ కడుపుతో ఉన్నప్పుడు ప్రతి మూడు నెలలకు ఎ?లాంటి ఆహారాన్ని తీసుకోవచ్చు, జీవన శైలిలో చేసుకోవాల్సిన మార్పులు ఏమేమిటి?, గర్భంతో ఉన్న కాలంలోనూ అనుసరించ గలిగిన యోగా పద్ధతులు, నొప్పులు వస్తున్నప్పుడు మానసికంగా వారు నిబ్బరంగా ఎలా ఉండవచ్చో తెలియజేయడం, శిశువుకు ఒంటి మర్దన చేసే తీరుతెన్నులు, మౌలిక జీవన రక్షణ నియమాలకు సంబంధించిన విషయాలను శిక్షణను పొందే వారికి బోధిస్తారు. అంటురోగాలకు గురి కాకుండా ఉండడమెలా.., స్వచ్ఛతకు పాటించవలసిన పద్ధతులు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ఎలా, పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తచర్యలు ఏమేమిటి వంటివాటిని కూడా ఈ కోర్సు పాఠ్యాంశాల్లో చేర్చారు.

న్యూఢిల్లీలోని సరితా విహార్ లో గల ఏఐఐఏ క్యాంపసులో అందుబాటులోకి తీసుకు వచ్చిన ఈ కోర్సులో, ఒక్కొక్క బ్యాచ్‌లో 20 మందిని చేర్చుకుంటారు. భారత్‌లోని ఏ గుర్తింపు పొందిన బోర్డు నుంచి అయినా సీనియర్ సెకండరీ (10+2) పరీక్ష పాసైన వారు, కనీసం 18 ఏళ్ల వయసున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ప్రస్తుతం 12వ తరగతి పరీక్షలు రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కూడా తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తు చేయవచ్చు.

కోర్సును పూర్తి చేశాక అభ్యర్థులు ''గర్భిణీ మిత్ర సహాయకులు''గా, ప్రీనేటల్, పోస్ట్‌నేటల్ కేర్ అసిస్టెంట్లుగా, యాంటీనేటల్ వెల్‌నెస్ గైడ్‌లుగా, మేటర్నల్ హెల్త్ సపోర్ట్ వర్కర్లుగా తమ కెరియర్‌ను మలుచుకోవచ్చు. వీరికి ఆయుష్ కేంద్రాలు, ప్రసూతి వైద్యశాలలు, ప్రభుత్వేతర సంస్థలు, కమ్యూనిటీ హెల్త్ ప్రాజెక్టులు, వెల్‌నెస్ సంస్థల్లో అవకాశాలు అందుబాటులో ఉంటాయి.

ప్రసవానికి ముందు దశలో చికిత్స సంబంధిత సంరక్షణను అందించడానికి 'గర్భిణీ మిత్ర' కార్యక్రమం ఒక ప్రత్యామ్నాయం ఏమీ కాదు కానీ, దానికి అనుబంధ భూమికను నిర్వహిస్తుంది. క్రమం తప్పక పరీక్షలు, రోగనిర్ధారణ పరీక్షలు, రక్త పోటు, హిమోగ్లోబిన్ పర్యవేక్షణ.. ఇవి అత్యవసరమే. కడుపుతో ఉన్న మహిళల్లో హెచ్చరిక సంకేతాలను గుర్తించి, వాటిని ఎప్పటికప్పుడు అర్హత కలిగిన డాక్టర్ల వద్దకు, ఆస్పత్రుల వద్దకు చేరుకోవడంలో శిక్షణను పూర్తి చేసిన 'గర్భిణీ మిత్ర'లు సహాయాన్ని అందిస్తారు.

# కరుణ, సంతృప్తి ప్రధానమని చెప్పే ఓ సంస్కృత సుభాషితాన్ని ప్రస్తావించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 25:కరుణ ఆత్మగౌరవాన్ని, సంతృప్తి సిసలైన ఆనందాన్ని అందిస్తాయని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఈ వైఖరిని అనుసరించడం వల్ల సమాజంలో సహకార, సద్భావన బంధాలు బలోపేతం అవుతాయని కూడా ఆయన అన్నారు.

''కారుణ్యేనాత్మనో మానం తృష్ణాం చ పరితోషతః, ఉత్థానేన జయేత్తన్ద్రీం వితర్కం నిశ్చయాజ్జయేత్'' అనే ఒక సంస్కృత సుభాషితాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు.

పరుల పట్ల దయను గాని, లేదా కరుణను గాని చూపినప్పుడు ఆత్మగౌరవం సిద్ధిస్తుంది. జీవితంలో ఉన్న దానితో సంతృప్తి చెందితే లోభంపై పైచేయిని సాధించవచ్చు. సోమరితనం, అనుమానాలకు తావునిచ్చే తర్కం, నిర్ణయం తీసుకోలేక పోవడం.. వీటిపై ప్రయత్నాలతో, కష్టపడి పనిచేయడం ద్వారా విజయాన్ని పొందవచ్చునని మనకు ఈ సుభాషితం బోధిస్తోంది.''కరుణతో ఆత్మగౌరవం, సంతోషంతో సిసలైన ఆనందం లభిస్తాయి. ఈ భావనలతో సమాజంలో సహకారం, సద్భావనల బంధాలు బలోపేతమవుతాయి.

# ప్రధానమంత్రితో 'ఐఎఫ్ఎస్ 2025 బ్యాచ్' ఆఫీసర్ ట్రైనీల సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 25: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో 'ఇండియన్ ఫారిన్ సర్వీస్' (ఐఎఫ్ఎస్)-2025 బ్యాచ్ ఆఫీసర్ ట్రైనీలు ఈ రోజు ఉదయం సేవా తీర్థ్‌లో సమావేశమయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 'ఐఎఫ్ఎస్'కు ఎంపికైన 50 మంది ఆఫీసర్ ట్రైనీలు ఈ బృందంలో ఉన్నారు.

ఈ సందర్భంగా యువ దౌత్యవేత్తలనుద్దేశించి మాటాడుతూ- విదేశాల్లో నియామకం తర్వాత క్షేత్రస్థాయిలో బలమైన సంబంధాలను ఏర్పరచుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా స్థానిక సమాజాలతో భారత్ స్నేహబంధాన్ని మరింత పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. భారత రాయబార కార్యాలయాలు కేవలం ప్రభుత్వాలు, సంస్థలతోనే కాకుండా సామాజిక స్థాయిలో ప్రజలతోనూ అర్థవంతమైన సంబంధాలు నెరపాలని ఆయన స్పష్టం చేశారు. సంప్రదాయ దౌత్య వర్గాలకు అతీతంగా నెట్‌వర్క్ విస్తరణకు యత్నించాలని, ముఖ్యంగా ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకోవాలని కోరారు. భారత అంతర్జాతీయ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా దేశ నాగరికతా బలాన్ని సాంకేతికత, ఆవిష్కరణలు, సమర్థ సమాచార ఆదానప్రదానంతో మేళవించాలని ప్రధానమంత్రి సలహా ఇచ్చారు.

ప్రపంచ దేశాలతో భారత్ ఆర్థిక సంబంధాలను మరింత ఉత్తేజితం చేయాలని, ఆయన ఆఫీసర్ ట్రైనీలకు పిలుపునిచ్చారు. భారత రాయబార కార్యాలయాల డిజిటల్ ఉనికిని పటిష్టం చేయాల్సిన ప్రాముఖ్యాన్ని ప్రస్ఫుటం చేశారు. ప్రజలు ఏదైనా వ్యవస్థతో సంబంధాలు నెరపాలంటే సాధారణంగా ఒక వెబ్‌సైట్ వంటి మొదటి మాధ్యమంగా ఉంటుందని పేర్కొన్నారు. తదనుగుణంగా కాన్సులర్, తదితర సేవలను మరింత నిరాటంకంగా, వేగంగా, పౌర-కేంద్రకంగా అందింగలిగేలా సాంకేతికత వినియోగం పెంచాలని పిలుపునిచ్చారు.

భారత నాగరికత, సాంస్కృతిక-భౌగోళిక ప్రాశస్త్యానికి విస్తృత ప్రాచుర్యం ద్వారా మన దేశాన్ని మరింత ఆకర్షణీయ ప్రపంచ పర్యాటక గమ్యంగా మార్చడానికి కృషి చేయాలని ప్రధానమంత్రి కోరారు. ప్రపంచ యువతరంలో భారత్‌పై ఆసక్తిని రగిలించడంలో భాగంగా ''భారత్ గురించి తెలుసుకోండి'' (భారత్ కో జానియే) క్విజ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలను మరింత ఆకర్షణీయంగా రూపొందించంలో కృత్రిమ మేధ (ఏఐ), గేమింగ్‌లను ఉపకరణాలు వాడుకోవాలని చెప్పారు.

ప్రధానమంత్రితో మాటామంతీలో భాగంగా తమ శిక్షణ విశేషాలతో పాటు భారత్ దర్శన్ అనుభవాలను ఆఫీసర్ ట్రైనీలు ఆయనతో పంచుకున్నారు. ప్రపంచంతో భారత నాగరికత, సాంస్కృతిక బంధాన్ని అర్థం చేసుకోవడంలోని ప్రాధాన్యం గురించి కూడా వారు ప్రస్తావించారు.


# మాతృత్వ శ్రేయస్సు కోసం ఆయుర్వేద ఆధారిత "గర్భిణీ మిత్ర" కోర్సు ప్రారంభించిన ఏఐఐఏ

న్యూఢిల్లీ, ఆగష్టు 25:ఆయుష్ మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేసే స్వయంప్రతిపత్తి సంస్థ అయిన 'అఖిల భారత ఆయుర్వేద సంస్థ' (ఏఐఐఏ) 2026-2027 విద్యాసంవత్సరానికి గాను "గర్భిణీ మిత్ర" కోర్సును ప్రారంభించింది. ఈ కార్యక్రమం వ్యవస్థీకృత ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ఓ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం. గర్భిణులకు, బాలింతలకు అవసరమైన వైద్య విద్యను, జీవనశైలికి సంబంధిం చిన మార్గదర్శకత్వాన్ని, సాముదాయిక స్థాయి సహాయాన్ని అందిం చగలిగే సిబ్బందిని తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ లక్ష్యం.

ఈ కోర్సును సాంప్రదాయిక ఆయుర్వేద భావనలైన 'గర్భిణీ పరిచర్య' (మహిళ గర్భంతో ఉన్న కాలంలో ఆమె సంరక్షణ), 'నూతిక పరిచర్య' (కాన్పు అనంతరం సంరక్షణ), 'గర్భాదాన విధి' (గర్భధారణకు పూర్వం సంరక్షణ).. ఈ అంశాల ఆధారంగా రూపొందించారు. ఈ కోర్సును ఆరు నెలల పాటు సోమవారం మొదలు శుక్రవారం దాకా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ మాధ్యమంలో బోధించేలా రూపొందించారు. మహిళ కడుపుతో ఉన్నప్పుడు ప్రతి మూడు నెలలకు ఎలాంటి ఆహారాన్ని తీసుకోవచ్చు, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులు ఏమేమిటి.., గర్భంతో ఉన్న కాలంలోనూ అనుసరించ గలిగిన యోగా పద్ధతులు, నొప్పులు వస్తున్నప్పుడు మానసికంగా వారు నిబ్బరంగా ఎలా ఉండవచ్చో తెలియజేయడం, శిశువుకు ఒంటి మర్దన చేసే తీరుతెన్నులు, మౌలిక జీవన రక్షణ నియమాలకు సంబంధి చిన విషయాలను శిక్షణను పొందే వారికి బోధిస్తారు. అంటు రోగాలకు గురి కాకుండా ఉండడమెలా.., స్వచ్ఛతకు పాటించవలసిన పద్ధతులు, బయోమె డికల్ వ్యర్థాల నిర్వహణ ఎలా, పని ప్రదేశంలో తీసుకోవా ల్సిన జాగ్రత్తచర్యలు ఏమేమిటి వంటివా టిని కూడా ఈ కోర్సు పాఠ్యాం శాల్లో చేర్చారు. న్యూఢిల్లీలోని సరితా విహార్ లో గల ఏఐఐఏ క్యాంపసులో అందుబాటులోకి తీసుకు వచ్చిన ఈ కోర్సులో, ఒక్కొక్క బ్యాచ్‌లో 20 మందిని చేర్చుకుంటారు. భారత్‌లోని ఏ గుర్తింపు పొందిన బోర్డు నుంచి అయినా సీనియర్ సెకండరీ (10+2) పరీక్ష పాసైన వారు, కనీసం 18 ఏళ్ల వయ సున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ప్రస్తుతం 12వ తరగతి పరీక్షలు రాసి, ఫలి తాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు కూడా తాత్కాలిక ప్రాతి పదికన దరఖాస్తు చేయవచ్చు.కోర్సును పూర్తి చేశాక అభ్యర్థులు "గర్భిణీ మిత్ర సహాయకులు"గా, ప్రీనేటల్, పోస్ట్‌నేటల్ కేర్ అసిస్టెంట్లుగా, యాంటీనేటల్ వెల్‌నెస్ గైడ్‌లుగా, మేటర్నల్ హెల్త్ సపోర్ట్ వర్కర్లుగా తమ కెరియర్‌ను మలుచు కోవచ్చు. వీరికి ఆయుష్ కేంద్రా లు, ప్రసూతి వైద్యశాలలు, ప్రభు త్వేతర సంస్థలు, కమ్యూనిటీ హెల్త్ ప్రాజెక్టులు, వెల్‌నెస్ సంస్థల్లో అవకాశాలు అందుబాటులో ఉంటాయి.ప్రసవానికి ముందు దశలో చికిత్స సంబంధిత సంరక్షణను అందించడానికి 'గర్భిణీ మిత్ర' కార్యక్రమం ఒక ప్రత్యామ్నాయం ఏమీ కాదు కానీ, దానికి అను బంధ భూమికను నిర్వహి స్తుంది. క్రమం తప్పక పరీక్షలు, రోగనిర్ధారణ పరీక్షలు, రక్త పోటు, హిమోగ్లోబిన్ పర్యవేక్షణ.. ఇవి అత్యవసరమే. కడుపుతో ఉన్న మహిళల్లో హెచ్చరిక సంకేతాలను గుర్తించి, వాటిని ఎప్పటికప్పుడు అర్హత కలిగిన డాక్టర్ల వద్దకు, ఆస్పత్రుల వద్దకు చేరుకోవడంలో శిక్షణను పూర్తి చేసిన 'గర్భిణీ మిత్ర'లు సహాయాన్ని అందిస్తారు.



Ministry of Culture
Government of India

సాహిత్య అకాడెమీ
ఆధ్వర్యంలో
**నా దృష్టిలో...**
కార్యక్రమానికి అందరికి స్వాగతం
**అందెశ్రీ**
ప్రసిద్ధ తెలుగు కవి, గీత రచయిత
జీవితం, సృజనాత్మక రచనలపై
**దేశపతి శ్రీనివాస్**
తెలుగు గీత రచయిత, గాయకుడు
ప్రసంగిస్తారు
గురువారం, 27 ఆగస్ట్ 2026, సాయంత్రం 5.30 గంటలకు
కాన్ఫరెన్స్ హాల్, రవీంద్ర భారతి, హైదరాబాద్

Phone : 080-22245152
Email : secretary@sahitya-akademi.gov.in / rs.rob@sahitya-akademi.gov.in
Website : https://sahitya-akademi.gov.in


# ప్రపంచ మేధావి అంబేద్కర్

### ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, ఆగష్టు 25:ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని సర్వాయిపేట గ్రామంలో సర్పంచ్ పోలు స్వరూప ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి మంగళవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని, ఆయన ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్డీవో, తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో యాదగిరి, వ్యవసాయ శాఖ అధికారి వైదేహి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సాయికుమార్, కొత్త తిరుపతి రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి భవిష్యత్తు విద్యార్థులే: సీఈసీ జ్ఞానేష్ కుమార్

న్యూఢిల్లీ, ఆగష్టు 25:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్నో వేదికగా ఈ రోజు "ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ (ఈఎల్‌సీ 2.0), ఈసీఐనెట్" అంశంపై రెండో ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహించింది. విద్యాసంస్థల ద్వారా యువతకు ఎన్నికల గురించి, ప్రజాస్వామ్య ప్రక్రియను గురించి అవగాహనను పెంపొందించడంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారించింది.

ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కూడిన ప్రతినిధులను ఉద్దేశించి సీఈసీ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను దేశ భవిష్యత్తుగా అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియల గురించిన జ్ఞానాన్ని, అవగాహనను ముందుకు తీసుకువెళ్లి ప్రజాస్వామ్యాన్ని సుసంపన్నం చేయడానికి ఈఎల్‌సీలు అత్యంత ఆవశ్యకమని ఆయన అన్నారు.

రాజ్యాంగం, చట్టం, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగానే దేశంలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. అన్ని దశల్లోనూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధుల పర్యవేక్షణలో (సమకాలీన తనిఖీతో) పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. భారత ఎన్నికల విధానం, ప్రజాస్వామ్య విలువలు, ఓటర్ల నమోదు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు, భారత ఎన్నికల సంఘం పాత్ర, పనితీరును గురించి విద్యార్థులకు, యువ ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతనూ ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

ఈ ప్రక్రియలో యువతను భాగస్వాములను చేయాల్సిన ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూ... ఎన్నికల ప్రక్రియలో వారి విశ్వాసం, అవగాహనతో కూడిన భాగస్వామ్యం ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం పెట్టుబడి వంటిదని సీఈసీ శ్రీ జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు.

"ప్రజాస్వామ్యాన్ని గురించి అవగాహన పొందండి... ప్రజాస్వామ్యానికి నాయకత్వం వహించండి..." అనే నినాదంతో... యువత, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న వారు ప్రజాస్వామ్యాన్ని గురించి తెలుసుకోవడం, ఈ ప్రక్రియలో అర్థవంతమైన భాగస్వామ్యం ద్వారా దాని పురోగతికి దోహదపడేలా వారిని ప్రోత్సహించాలనే లక్ష్యాన్ని ఈఎల్‌సీ 2.0 బలపరుస్తుంది.

అంతకుముందు, శ్రీ జ్ఞానేష్ కుమార్ తాను చదువుకున్న 'కాల్విన్ తాలూక్దార్స్ కళాశాల'ను సందర్శించారు. అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించారు. తన పర్యటనలో రెండో రోజైన రేపు... సీఈసీ శ్రీ జ్ఞానేష్ కుమార్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన బూత్ స్థాయి అధికారులతో (బీఎల్‌వోలతో) సమావేశమై వారితో సంభాషిస్తారు.

పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల అంతటా ఎన్నికల ప్రక్రియ గురించిన అవగాహన క్లబ్‌లను... నిర్మాణాత్మక, విజిబుల్, డిజిటల్ ఆధారిత వేదికలుగా ఈఎల్‌సీ 2.0 అభివృద్ధి చేస్తోంది. ఈ కార్యక్రమం యువతలో, వారి కుటుంబాలు, విద్యా సంస్థలు, కమ్యూనిటీల్లో ఎన్నికల ప్రక్రియ గురించిన అవగాహనను ప్రోత్సహించడానికి నిరంతర, ఏడాది పొడవునా నిర్వహించే కార్యకలాపాలను రూపొందిస్తుంది.

విస్తృతమైన ఈసీఐనెట్ డిజిటల్ వేదికను ఈఎల్‌సీ 2.0 వినియోగించుకుంటుంది. ఇది ఓటర్ల జాబితా తయారీ నుంచి పోలింగ్ వరకు ఎన్నికలకు సంబంధించిన అన్ని సేవల గురించిన సమాచారాన్ని కేవలం ఒక బటన్ క్లిక్‌తో అందిస్తుంది. ఈసీఐనెట్‌లోని ప్రత్యేక ఈఎల్‌సీ పోర్టల్ ద్వారా, దేశవ్యాప్తంగా ఒక క్రమబద్ధమైన ఈఎల్‌సీ నెట్‌వర్క్‌ను ఇది ఏర్పాటు చేస్తుంది.

సుమారు 15 లక్షల పాఠశాలలు, దాదాపు 25 కోట్ల మంది విద్యార్థులు, కోటి మందికి పైగా ఉపాధ్యాయులతో కూడిన భారత విస్తృత విద్యా వ్యవస్థ లక్ష్యంగా రూపొందించిన ఈ కార్యక్రమం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇక ఉన్నత విద్యా రంగంలో దాదాపు 1,500 విశ్వవిద్యాలయాలు, సుమారు 70,000 విద్యా సంస్థలు ఉండగా, వాటిలో సుమారు 4.33 కోట్ల మంది విద్యార్థులు ఉన్నట్లు అంచనా.

విస్తృతమైన ఈ సంస్థాగత నెట్‌వర్క్ ద్వారా ఎన్నికల ప్రక్రియ గురించి వాస్తవిక, అనుభవపూర్వక అవగాహనను ప్రోత్సహించడం... భారత ఎన్నికల వ్యవస్థ పారదర్శకత, సమగ్రత, విశ్వసనీయతపై అవగాహనను పెంపొందించడం... యువతను విజ్ఞానవంతమైన ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి రాయబారులుగా మారేలా ప్రోత్సహించడం ఈఎల్‌సీ 2.0 లక్ష్యం.

ఓటర్ల నమోదు, పోలింగ్, ఓట్ల లెక్కింపు వంటి ఎన్నికల ప్రక్రియల్లోని వివిధ దశల గురించిన సమాచారాన్ని, ఈసీఐ నెట్ యాప్, భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఇతర కీలక కార్యక్రమాలను గురించి ప్రజలకు అవగాహన కలిగించే వేదికలుగా ఈఎల్‌సీలు పనిచేస్తాయి.

# పర్యావరణ సమతుల్యతను కాపాడుకోకపోతే మానవ మనుగడ కష్టసాధ్యం

## ఇల్లెందులో ఘనంగా వనమహోత్సవం

ఖమ్మం, ఆగష్టు 25: పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మానవ మనుగడ కష్టసాధ్యమని సింగరేణి జనరల్ మేనేజర్ కృష్ణయ్య, ఎస్‌హెచ్‌వో సురేష్, డీఆర్వో రాంసింగ్ అన్నారు. ఇల్లెందు రేంజ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో కోరగుట్ట వద్ద ఉన్న పార్కులో వనమహోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం మానవ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణతో పాటు సమృద్ధిగా వర్షాలు కురవడానికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కకు నీరు పోసి సంరక్షించి పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో, అటవీ శాఖ సిబ్బంది, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# రైలు బండి దీక్షకు రజక సంఘం మద్దతు..




ఖమ్మం, ఆగష్టు 25:ఇల్లందుకు ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని మలి దశ తెలంగాణ ఉద్యమ నాయకుడు కంచర్ల శ్రీనివాస్ చేపట్టిన దీక్షకు పట్టణ రజక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని మంగళవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు సత్యం మాట్లాడుతూ ఇల్లెందు ప్రజల చిరకాల కోరిక ప్యాసింజర్ రైలు పునరుద్ధరణేనని అన్నారు. రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇల్లందుకు ప్యాసింజర్ రైలు తిరిగి రావాలని దీక్ష చేపడుతున్న కంచర్ల శ్రీనివాస్‌కు పట్టణ రజక సంఘం పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి ఇల్లెందుకు ప్యాసింజర్ రైలు పునరుద్ధరణకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# బంగారం చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్..

## బండమీది తండా చోరీ కేసును మూడు రోజుల్లో ఛేదించిన పోలీసులు




ఖమ్మం, ఆగష్టు 25:బంగారం చోరీ కేసును కూసుమంచి పోలీసులు త్వరితగతిన ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. అయితే కూసుమంచి మండలంలో గతంలో ఓ విలేకరి ఇంట్లో జరిగిన బంగారం చోరీ కేసు నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ ఛేదించకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య కూసుమంచి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండమీది తండాలో భూక్య మంగ్య ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ ఘటనలో సుమారు మూడున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ఈ నెల 24న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గనిందితుల్లో చిలుకూరు గ్రామానికి చెందిన కిన్నెర మధు (41), ముడిగొండ వెంకన్న (41) ఉన్నారు. కిన్నెర మధుపై సూర్యాపేట, నల్గొండ, వరంగల్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో గతంలో 30కి పైగా క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. అతనిపై గతంలో పీడీ చట్టం కింద కూడా కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న కూసుమంచి సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని ఖమ్మం రూరల్ ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు. అయితే గతంలో కూసుమంచి మండలంలో ఓ విలేకరి ఇంట్లో జరిగిన బంగారం దొంగతనం కేసు మాత్రం ఇప్పటికీ కొలిక్కిరాలేదని బాధితులు గుర్తు చేస్తున్నారు. ఆ ఘటన జరిగి నాలుగేళ్లు గడుస్తున్నా నిందితులను గుర్తించకపోవడం, చోరీ సొత్తును రికవరీ చేయకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన కేసులను వేగంగా ఛేదించినట్లే పాత బంగారం చోరీ కేసులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని బాధితులు కోరుతున్నారు.

# భూసార పరిరక్షణకు భారత్ విజయవంతంగా అమలు చేసిన సమ్మిళిత హరిత ఆర్థిక విధానాన్ని ప్రశంసించిన కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 25:మంగోలియాలోని ఉలాన్‌బాతోర్ వేదికగా ఎడారీకరణ నిర్మూలనపై యూఎన్ సదస్సు (యూఎన్‌సీసీడీ) 17వ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్‌లో 'భూసార పరిరక్షణ, కరవు నివారణకు వినూత్న ఆర్థిక విధానాలు' అంశంపై మంత్రివర్గ చర్చ జరిగింది. ఈ సదస్సులో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసార పరిరక్షణ, కరవు నివారణకు భారత్ అమలు చేస్తున్న వినూత్న, వైవిధ్యభరితమైన ఆర్థిక విధానాలను వివరించారు.

భూమి పునరుద్ధరణకు నిరంతరం పెట్టుబడి పెట్టాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ "భూసార పరిరక్షణ కేవలం ఖర్చు కాదు.. ఆహారం, నీరు, జీవవైవిధ్యం, జీవనోపాధి, దీర్ఘకాలిక స్థిరత్వంపై పెట్టుబడి" అని శ్రీ భూపేందర్ యాదవ్ అన్నారు. ఎడారీకరణ, భూసార క్షీణత, కరవులను పెద్దఎత్తున ఎదుర్కొనేందుకు ప్రభుత్వ బడ్జెట్‌కు అతీతంగా వైవిధ్యభరితమైన, ఊహించదగిన, స్థిరమైన ఆర్థిక వనరులతో పాటు బలమైన ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాలు అవసరమని స్పష్టం చేశారు.

వాతావరణ మార్పుల అనుకూలత, సుస్థిర భూవినియోగం, అడవులు, వ్యవసాయం, అడవుల పెంపకం, జీవవైవిధ్య సంరక్షణకు నిధులను సమకూర్చే భారతదేశ సమ్మిళిత హరిత–ఆర్థిక విధానాన్ని మంత్రి వివరించారు. భూసార పరిరక్షణ, కరువు నివారణ, సుస్థిర అడవుల పెంపకం, ఇతర పర్యావరణ, వాతావరణ ప్రాధాన్యతలకు పెట్టుబడిని సమీకరించే మార్గంగా ప్రభుత్వ హరిత బాండ్లను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

భారతదేశ గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ గురించి శ్రీ భూపేందర్ యాదవ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది క్షీణించిన అటవీ భూముల పునరుద్ధరణకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఆర్థిక సహాయం చేసేందుకు వీలు కల్పిస్తుంది. పునరుద్ధరణ ప్రారంభించిన అయిదేళ్ల తర్వాత కనీసం 40 శాతం చెట్ల సాంద్రత సాధించిన తర్వాత ఈ క్రెడిట్లను జారీ చేస్తారు. వీటిని ప్రత్యామ్నాయ అడవుల పెంపకం, చట్టబద్ధమైన మొక్కల పెంపకం, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిబంధనల ద్వారా ఒకసారి మాత్రమే ఉపయోగించుకోవచ్చు. భారతదేశ ప్రత్యామ్నాయ అటవీ సంరక్షణ విధానంలో అటవీ భూముల మళ్లింపు ద్వారా వచ్చే నిధులను... అటవీ పునరుద్ధరణ, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణకు మళ్లిస్తారని తెలిపారు. కార్పొరేట్ నిధులను పర్యావరణ నియంత్రణ ప్రక్రియలతో అనుసంధానిస్తారని చెప్పారు.

సమన్వయ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూ.. గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్, ప్రత్యామ్నాయ అటవీ పెంపకం నిధులు వంటి విభిన్న విధానాల ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆర్థిక వనరులను ఒకచోట చేర్చటం, పౌరుల భాగస్వామ్యంతో అనుసంధానించటం "సమగ్ర ప్రభుత్వం, సమగ్ర సమాజం" దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని మంత్రి తెలిపారు. "ఆర్థిక వనరులు నిరంతరంగా, పరిశీలనకు వీలుగా ఉండేలా, స్థానిక కమ్యూనిటీలకు అనుసంధానమై ఉండాలి" అని శ్రీ భూపేందర్ యాదవ్ స్పష్టం చేశారు. పర్యావరణ పునరుద్ధరణ, కరవు నివారణకు అదనపు, సరైన, ఊహించదగిన, అంతర్జాతీయ ఆర్థిక సహాయానికి ఇవి ప్రత్యామ్నాయం కాలేనప్పటికీ ప్రాముఖ్యత గల దేశీయ వనరులు ఏం సాధించగలవో భారతదేశ అనుభవం నిరూపిస్తోందని ఆయన తెలిపారు. అనుభవాలు, రక్షణ విధానాలు, వ్యవస్థాగత ఏర్పాట్లు, నేర్చుకున్న పాఠాలు, దిద్దుబాట్లు అవసరమైన అంశాలను పంచుకోవటానికి భారతదేశ నిబద్ధతను మంత్రి మరోసారి స్పష్టం చేశారు. "అంతిమంగా వినూత్న ఆర్థిక సహాయాన్ని... రూపకల్పన లేదా సమీకరించిన వనరుల ఆధారంగా కాక, అవసరమైన భూమి, పర్యావరణ వ్యవస్థలు, కమ్యూనిటీలను చేరిందా, శాశ్వత పునరుద్ధరణను, స్థిరత్వాన్ని నెలకొల్పిందా వంటి అంశాల ఆధారంగా అంచనా వేయాలి" అని చెబుతూ ప్రసంగాన్ని ముగించారు.

# కోయంబత్తూర్ ఎడిషన్‌లో జెనెసిస్ ఎంట్రప్రెన్యూర్ ఇన్- రెసిడెన్స్ (ఈఐఆర్) కోహోర్ట్-3 ప్రారంభం

న్యూఢిల్లీ, ఆగష్టు 25:కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికతా మంత్రిత్వశాఖ (ఎంఈఐటీవై) తన స్టార్టప్ హబ్ (ఎంఎస్‌హెచ్) ద్వారా 'జెనెసిస్ ఎంట్రప్రెన్యూర్–ఇన్–రెసిడెన్స్ (ఈఐఆర్) కోహోర్ట్–3' జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వినూత్న ఆలోచనలను సాంకేతికతా చోదక సంస్థల ఏర్పాటు దిశగా మలచడంలో – ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రారంభ దశల్లో ఉన్న అంకుర సంస్థల వ్యవస్థాపకులకు దన్నుగా నిలవడం ఈ కార్యక్రమ లక్ష్యం. కోయంబత్తూరులోని రథినమ్ గ్లోబల్ యూనివర్సిటీలో 2026 ఆగష్టు 4న నిర్వహించిన 'జెనెసిస్ నెక్స్ట్‌జెన్ స్టార్టప్ సమ్మిట్ (కోయంబత్తూరు ఎడిషన్)'లో 'జెనెసిస్ ఈఐఆర్ –3.0'ను ప్రారంభించారు. అంకుర సంస్థలు, ఆవిష్కరణల రంగానికి సంబంధించి.. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం అది అందుబాటులో ఉంది.

గజెనెసిస్ ఈఐఆర్ 3.0 అనేది జెనెసిస్ (జెన్–నెక్స్ట్ సపోర్ట్ ఫర్ ఇన్నోవేటివ్ స్టార్టప్స్) పథకంలో ఒక ముఖ్యమైన భాగం. ముఖ్యంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో అంకుర సంస్థలను గుర్తించడం, ప్రోత్సహించడం, వాటి ఎదుగుదలను వేగవంతం చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ ఎంట్రప్రెన్యూర్–ఇన్–రెసిడెన్స్ కార్యక్రమం ద్వారా.. ఆవిష్కర్తలు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు తమ ప్రారంభ దశ ఆలోచనలను పూర్తిస్థాయి వినియోగానికి సిద్ధంగా ఉండే మార్గాలుగా మలచుకునేందుకు నిర్దిష్టమైన నిధుల సదుపాయాన్ని, ఇంక్యుబేషన్ సహకారాన్ని అందిస్తారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నెలకొల్పిన స్టార్టప్ హబ్.. అంకుర సంస్థలు, ఇంక్యుబేటర్లు, యాక్సిలరేటర్లు, పరిశ్రమలు, పెట్టుబడిదారులు, మెంటార్లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ భాగస్వామ్య వర్గాలను ఒకే తాటిపైకి తెచ్చే జాతీయ స్థాయి వేదికగా వ్యవహరిస్తోంది. ఇది దేశ డీప్‌టెక్ రంగాన్ని బలోపేతం చేస్తూ.. ఆలోచనల స్థాయి నుంచి వాణిజ్యీకరణ, విస్తరణ వరకు సమగ్ర ఆవిష్కరణల ప్రయాణానికి అండగా నిలుస్తోంది.

జ్ఞానదాయకమైన ఆలోచనలను పరస్పరం పంచుకోవడం, మార్గనిర్దేశం, నెట్వర్కింగ్, వ్యవస్థాగత సహకారం ద్వారా – ఆవిష్కరణలే ప్రాతిపదికగా పారిశ్రామిక సంస్కృతిని ప్రోత్సహించడం లక్ష్యంగా.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, విద్యా సంస్థలు, పారిశ్రామిక ప్రముఖులు, పరిశ్రమ భాగస్వామ్య వర్గాలను ఒక్కచోట చేర్చి, వారిలో స్ఫూర్తిని నింపే, వారిని అనుసంధానించి సాధికారులను చేసే ఉమ్మడి వేదికగా 'జెనెసిస్ నెక్స్ట్ జెన్ స్టార్టప్ సమ్మిట్ – కోయంబత్తూరు ఎడిషన్'ను నిర్వహిస్తున్నారు.

గముఖ్య ప్రసంగం అనంతరం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికతా మంత్రిత్వశాఖ స్టార్టప్ హబ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ పన్నీర్‌సెల్వం మదనగోపాల్.. 'జెనెసిస్ ఈఐఆర్ 3.0'ను లాంఛనంగా ప్రారంభించారు. కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ తిరు పవన్ కుమార్ జి. గిరియప్పనవర్, రథినమ్ గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ మదన్ ఎ. సెంథిల్, ఇతర ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తద్వారా ప్రణాళికాబద్ధమైన ఆర్థిక సాయం, మార్గనిర్దేశం, ఇంక్యుబేషన్ మద్దతు, దేశవ్యాప్త ఆవిష్కరణల వ్యవస్థను అందుబాటులోకి తేవడం ద్వారా – ప్రారంభ దశలో ఉన్న ఆవిష్కర్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ.. వినూత్న ఆలోచనలను ప్రామాణిక ధ్రువీకృత నమూనాలుగా, విస్తరించదగిన సాంకేతికతా చోదక వ్యాపారాలుగా మలచుకునేలా వారికి చేయూతనివ్వడంలో తన అంకితభావాన్ని స్టార్టప్ హబ్ (ఎంఎస్‌హెచ్) చాటుకుంది.

# చౌటుప్పల్‌లో ప్రశాంతంగా పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు

నల్గొండ, ఆగష్టు 25: తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఎన్నికల్లో అర్హత కలిగిన పోలీసు సిబ్బంది పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎన్నికల నిర్వహణ అధికారి, ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ పక్కా ప్రణాళికతో కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి. ఎన్నికల బరిలో కె. నాగరాజు, పి. శ్రీను, వి. శ్రీనివాస్, వి. వీర కృష్ణ, వి. ఉపేందర్ మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీ చేశారు. ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు లోబడి నిర్వహించినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి మన్మథ కుమార్ తెలిపారు.

# ఎంపీ అరవింద్ జన్మదినం సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



నిజామాబాద్, ఆగష్టు 25:నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ ఆధ్వర్యంలో భీమ్‌గల్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీ అరవింద్ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆరే రవీందర్ మాట్లాడుతూ ధర్మపురి అరవింద్ తన ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు 278 మంది చిన్నారులకు హృదయ సంబంధిత వైద్య సహాయం అందించినట్లు పేర్కొంటూ, ఆయన సేవలను కొనియాడారు.

బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, కార్యకర్తలకు ఆపద వచ్చినప్పుడు ఏడీఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా, కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా ఎంపీ అరవింద్ ముందుకు సాగుతున్నారని పేర్కొంటూ భీమ్‌గల్ మండల బీజేపీ తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యుడు యోగేశ్వర నరసయ్య, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట గంగాధర్, యువ మోర్చా అధ్యక్షుడు శెట్టి ప్రేమ్, మండల ప్రధాన కార్యదర్శి బిర్రు రామకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి నవీన్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు నీలం గంగాధర్, దయ్యు ప్రవీణ్, కొండ గంగాధర్, బూత్ అధ్యక్షులు బాబురావు, బుదన్న, గంగాధర్, బావన్న, కళ్లేడ గిరిధర్‌తో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు, పోలీసుల మధ్య ఘర్షణ.. బిహార్‌లో ఉద్రిక్తం

న్యూఢిల్లీ, ఆగష్టు 25: కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్న బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసిన అభ్యర్థులు, వందల మంది విద్యార్థులు మంగళవారం పట్నాలోని బిహార్ రాష్ట్ర సీఎం సమ్రాట్ చౌధరి నివాసం వైపు ర్యాలీ తీశారు. అడ్డుగా ఉన్న బారికేడ్లను దాటారు. ఈ సందర్భంగా 70వ బీపీఎస్‌సీ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థులను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జ్ చేశారు. వాటర్ క్యానన్లను ప్రయోగించారు. అయినప్పటికీ వారు సీఎం నివాస సమీపానికి చేరుకున్నారు. భూ సంబంధిత సమస్యలపై రైతు సంఘం నల్ల జెండాలు పట్టుకుని ఈ ఆందోళనలో చేరడంతో సీఆర్‌పీఎఫ్ బలగాలు మోహరించాయి.

బీపీఎస్‌సీ–టీఆర్ఈ 4 ఒకే పరీక్ష, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, హిందీ మీడియం విద్యార్థులకు బిహార్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (బీఎస్ఎస్‌సీ) పరీక్షల్లో సమాన అవకాశాలు కల్పించడం వంటి డిమాండ్లతో విద్యార్థులు, అభ్యర్థులు కొన్ని రోజులుగా పట్నాలోని గార్డనిబాగ్‌లో ఆందోళన చేపడుతున్నారు. బిహార్ ప్రభుత్వంతో విద్యార్థి ప్రతినిధులు చర్చలు జరిపారు. చర్చలు సానుకూలంగా జరిగాయని విద్యార్థి నాయకుడు సౌరవ్ కుమార్ చెప్పినప్పటికీ తమ అన్ని డిమాండ్ల సాధన కోసం ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు, అభ్యర్థులు నిర్ణయించుకున్నారు. దీంతో సీఎం నివాసం వైపు ర్యాలీ తీయగా పోలీసులు, వారికి మధ్య ఘర్షణ నెలకొంది.

కింది స్థాయి అధికారులతో చర్చలు జరిపించి తరువాత మా సమస్యను మరిచిపోతున్నారు. కాబట్టి బిహార్ సీఎం లేదా డిప్యూటీ సీఎంతో చర్చలకు అవకాశం కల్పించి, సమస్యలపై అధికార ప్రకటన చేస్తేనే మా నిరసన విరమిస్తామని విద్యార్థి నాయకుడు ఒకరు వెల్లడించారు. సీఎంను కలిసేందుకు అనుమతించాలన్నదే మా ప్రధాన డిమాడ్, విద్యాశాఖ మంత్రి కలిసే అవకాశం కల్పించడం అనేది రెండో ప్రత్యామ్నాయం. అంతే తప్ప ఇంకెవ్వరినీ కలవం అని ఆ విద్యార్థి నాయకుడు స్పష్టం చేశారు. దీనిపై సీఎం సమ్రాట్ చౌధరి స్పందించారు. విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకెళ్లేలా ప్రతి నెలా నాలుగో మంగళవారం విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తామని అన్నారు.

# 'ఆపరేషన్ బ్లాక్ హాక్' ద్వారా అంతర్రాష్ట్ర హెరాయిన్ ముఠాను పట్టుకున్న సీబీఎన్ 18.6 కిలోలకుపైగా ముడి హెరాయిన్ స్వాధీనం

న్యూఢిల్లీ, ఆగష్టు 25:మాద్రవ్యాల అక్రమ రవాణాపై చేపట్టిన కీలక చర్యలో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ (సీబీఎన్) మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ విభాగాల అధికారులు 'ఆపరేషన్ బ్లాక్ హాక్'ను విజయవంతంగా నిర్వహించారు. లక్నో (యూపీ) సమీపంలో వెనువెంటనే చేపట్టిన చర్యల్లో మొత్తం 18.64 కిలోల ముడి హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అంతర్రాష్ట్ర అక్రమ రవాణా ముఠాకు చెందిన ముగ్గురు కీలక వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ నిషేధిత పదార్థాలను ఉత్తరప్రదేశ్‌లో విక్రయించేందుకు ఈశాన్య రాష్ట్రం నుంచి అక్రమంగా తరలించారు.

సీబీఎన్ ఎంపీ విభాగం అందించిన సమాచారం ప్రకారం... ఈశాన్య ప్రాంతం నుంచి లక్నోకు తరలిస్తున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సీబీఎన్ ఎంపీ, యూపీ బృందాలు ఉమ్మడిగా చర్యలు చేపట్టాయి. ఈ మేరకు ఆగస్టు 20 నుంచి 21, 2026 మధ్యరాత్రి సుల్తాన్‌పూర్-లక్నో జాతీయ రహదారిపై వ్యూహాత్మకంగా తనిఖీలు నిర్వహించాయి.

వివిధ టోల్ ప్లాజాల వద్ద వాహనాన్ని ట్రాక్ చేసిన తర్వాత ఆగస్టు 21న లక్నో సమీపంలో అస్సాం రిజిస్ట్రేషన్ గల హ్యుందాయ్ క్రెటా కారును ప్రత్యేక నిఘా బృందం అడ్డుకుంది. ఆ వాహనంలో ఏమీ లభించలేదు. అందులోని ప్రయాణికులు ఏమీ తెలియదని చెప్పారు. అయితే కేవలం 500 కిలోమీటర్ల వ్యవధిలోనే నాలుగు సార్లు ఇంధనం నింపినట్లు చెప్పటంతో అధికారులకు అనుమానం వచ్చింది. ఇంధన ట్యాంకును తట్టి చూడగా, తేడాగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సాంకేతిక నిపుణుల సాయంతో లక్నోలోని సీబీఎన్ ఆఫీసులో ఇంధన ట్యాంకును విడదీసి చూశారు. అందులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య అర కనిపించింది. అందులో 25 వాటర్‌ప్రూఫ్ ప్యాకెట్లలో దాచిన 16.46 కిలోల ముడి హెరాయిన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

మరో సంఘటనలో సిలిగురి-లక్నో కారిడార్ గుండా ఒక భారీ వాహనం ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు సీబీఎన్ యూపీ విభాగం ముందస్తు సమాచారం అందించింది. ఆ వాహనాన్ని పలు టోల్ ప్లాజాల వద్ద సీబీఎన్ బృందాలు పరిశీలిస్తూ వచ్చి, బారాబంకి సమీపంలో అడ్డుకున్నాయి. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, దాని బాడీ ఫ్రేమ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక రహస్య గదిలో దాచిన 2.16 కిలోల ముడి హెరాయిన్ బయటపడింది. ఈ ఘటనకు సంబంధించి ఒకరిని అరెస్టు చేశారు.

ముగ్గురు నిందితులపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం-1985లోని కఠినమైన నిబంధనల ద్వారా కేసులు నమోదు చేశారు. రవాణాకు ఉపయోగించిన రెండు వాహనాలతో పాటు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ మొత్తాన్ని అధికారులు జప్తు చేశారు. ఈ సరఫరా వెనుక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న ప్రధాన ముఠాలను గుర్తించటంతో పాటు స్థానిక పంపిణీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఛేదించేందుకు ఆర్థిక, రవాణా అంశాలకు సంబంధించిన సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది.

# చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## జలవనరుల హద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగా గుర్తించాలి.
## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



ములుగు ఆగష్టు 25:(నేటనిజం ప్రతినిధి): జిల్లాలోని చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, జలవనరుల హద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగా గుర్తించాలని జిల్లా కలెక్టర్, జిల్లా చిత్తడి నేలల కమిటీ చైర్మన్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.2

మంగళవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి చిత్తడి నేలల కమిటీ సమావేశం నిర్వహిం చారు.

జిల్లాలోని చిత్తడి నేలల గుర్తింపు, సర్వే, హద్దుల నిర్ధారణ, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తడి నేలలు, జలవనరుల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని జలవనరులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,

వాటి విస్తీర్ణం, హద్దులకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే, హద్దుల నిర్ధారణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సమగ్ర నివేదికను రాష్ట్ర చిత్తడి నేలల ప్రాధికార సంస్థకు పంపించాలని ఆదేశించారు. జలవనరుల పరిశీలనలో నీటిపారుదల, అటవీ, రెవెన్యూ శాఖలు ప్రధాన బాధ్యత వహించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామీణా భివృద్ధి, పంచాయతీరాజ్, పురపాలక, కాలుష్య నియంత్రణ మండలి, మత్స్య, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా క్షేత్రస్థాయి పనులను వేగవంతం చేయాలని ఆదేశం చారు. ప్రతి జలవనరును స్వయ ంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ సంపత్, డి పి ఓ వెంకయ్య, డి ఏ ఓ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానవ శాఖ అధికారి సంజీవరావు, డి ఆర్ డి ఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు



నిజామాబాద్, ఆగష్టు 25: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలంలోని పిప్రి (జె) గ్రామపంచాయతీ పరిధిలో పర్యావరణ పరిరక్షణ, మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో నాటిన మొక్కలను కాపాడటం, కొత్త మొక్కలు నాటడం, వాటి పెంపకాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.సర్పంచ్ అరిగెల జనార్ధన్, ఉప సర్పంచ్ రంజిత్ అలియాస్ జేమ్స్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. సభ్యులుగా పల్లె శ్రీనివాస్, బీమార్తి రాజేశ్వర్, కుంబాల అర్చన, భూక్య సంజన, జితేందర్ ఉన్నారు. మొక్కలను జంతువుల నుంచి రక్షించడం, వాటికి అవసరమైన నీటిని అందించడం, నాటిన మొక్కలను సంరక్షించి పెంచడం, గ్రామ పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దడం కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలి
## మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు
## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు ఆగష్టు 25: (నేటినిజం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పాటుపడాలని, మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.

వన మహోత్సవం సందర్భంగా మంగళవారం గట్టమ్మ సమీపంలోని పంచాయతీరాజ్ పైలాన్ ఆవరణలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.

భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ములుగు ఎఫ్‌డీఓ సత్తయ్య, జాకారం సర్పంచ్, అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 9వ జాతీయ భద్రతా వ్యూహాల (ఎన్ఎస్ఎస్) సదస్సు-2026ను ప్రారంభించిన కేంద్ర హోం, సహకారశాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగష్టు 25:న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగే 9వ జాతీయ భద్రతా వ్యూహాల (ఎన్ఎస్ఎస్) సదస్సు-2026ను ఇవాళ కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించారు.

సదస్సు ప్రారంభానికి ముందుగా... అమరవీరుల స్థూపం వద్ద కేంద్ర మంత్రి నివాళులు అర్పించారు. దేశ భద్రత, సమగ్రతను పరిరక్షించేందుకు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఇంటెలిజెన్స్ బ్యూరో సిబ్బందిని స్మరించుకున్నారు.

దేశవ్యాప్తంగా 850 మందికి పైగా ప్రతినిధులు హాజరైన ఈ సదస్సును హైబ్రిడ్ విధానంలో నిర్వహించారు. ఢిల్లీలో జరిగిన ఈ సదస్సులో కేంద్ర హోం వ్యవహారాల సహాయమంత్రులు, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, డిప్యూటీ ఎన్ఎస్ఏలు, సీఏపీఎఫ్‌లు, సీపీఓ అధిపతులు హాజరయ్యారు. వివిధ రాష్ట్రాలు, యూటీల డీజీపీలు, క్షేత్రస్థాయిలో పని చేసే పోలీసు అధికారులు, పలు ప్రత్యేక రంగాలకు చెందిన నిపుణులు వర్చువల్ విధానంలో ఈ సదస్సులో పాల్గొన్నారు.

సమావేశం మొదటి రోజున జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై చర్చలుంటాయి. ఇందులో ఉగ్రవాద వ్యతిరేక సవాళ్లకు ప్రతిస్పందన, వివిధ ఏజెన్సీల ద్వారా అందే నిఘా సమాచారం, విశ్లేషణ, కార్యాచరణ, మాదకద్రవ్యాల నియంత్రణకు డాక్యుమెంట్, అక్రమ వలసదారుల గుర్తింపు, బహిష్కరణ, సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు విధానపరమైన వ్యవస్థ, పాకిస్తాన్ ప్రచ్ఛన్న యుద్ధం వంటి అంశాలున్నాయి.

ఉగ్రవాదం, తీవ్రవాద భావాజాలాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పలు కీలక అంశాలపై దృష్టి సారించాలని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు. ఎంహెచ్ఏ ప్రహార్ పథకం అమలు కోసం తగిన శిక్షణ ఇవ్వటం, పరారీలో ఉన్న నిందితులు వెనక్కి రప్పించటం ద్వారా విచారణను వేగవంతం చేయటం, గైర్హాజరీలో విచారణ నిబంధనలను ఉపయోగించటం, యూఏపీఏ కేసులను దర్యాప్తు చేసేప్పుడు సమగ్ర, సమీకృత విధానాన్ని అనుసరించటం, వివిధ జాతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కోవటానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను (ఎస్ఓపీలు) రూపొందించేందుకు ఎంఏసీ వేదికల్లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఏఐ ఆధారంగా విశ్లేషించాలని హోంమంత్రి సూచించారు. అక్రమ చొరబాట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించారు.

సబ్ ఏరియల్ వ్యవస్థల నుంచి ముప్పు, వాటికి వ్యతిరేకంగా తీసుకోవాల్సిన నివారణ చర్యలు, బ్లూ ఎకానమీ, భద్రత, ఇన్ఫర్మేషన్ వార్‌ఫేర్, జాతీయ భద్రతపై ప్రభావాలు, బయో-సెక్యూరిటీ వ్యవస్థ అవసరం వంటి అంశాలపై రెండో రోజు సమావేశంలో చర్చిస్తారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారుల అనుభవాన్ని, సంబంధిత నిపుణుల సహకారాన్ని జోడించి జాతీయ భద్రతా సవాళ్లకు పరిష్కారాలు కనుగొనాలనే ఉద్దేశంతో 2021 నుంచి ఏటా హైబ్రిడ్ విధానంలో ఎన్ఎస్ఎస్‌సీని నిర్వహిస్తున్నారు.

# '2025-26 సంవత్సరానికి గాను 58వ యూత్ పార్లమెంట్ పోటీ' బహుమతుల ప్రదాన కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగష్టు 25:ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ (ఎన్‌సీటీ) ప్రభుత్వ విద్య డైరెక్టరేట్‌తో పాటు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎమ్‌సీ) విద్య విభాగ అధికార పరిధిలోని పాఠశా లలకు '2025-26 సంవత్స రానికి నిర్వహించిన 58వ యూత్ పార్లమెంట్ పోటీ' బహుమతుల ప్రదానం కార్యక్ర మాన్ని రేపు.. అంటే 2026 ఆగస్టు 25న ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని న్యూఢిల్లీ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో గల పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగు.. జీఎమ్‌సీ బాలయోగి సభాభ వనంలో నిర్వహించ నున్నారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర చట్ట, న్యాయ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్‌వాల్ అధ్యక్షత వహించి, పోటీలో ప్రతిభాపాటవాలను కనబరిచిన పాఠశాల విద్యా ర్థులకు బహుమతులను అందజేస్తారు. ఈ సందర్భంగా, ఢిల్లీ పీతం పురా పర్వానా రోడ్డు ప్రాం తంలో గల బాల భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు "యూత్ పార్లమెంట్ సిటింగ్"ను పున ఃప్రదర్శిం చనున్నారు. '2025 -26 సంవత్సరానికి 58వ యూత్ పార్లమెంట్ పోటీ'ని ఢిల్లీ ఎన్‌సీటీ ప్రభుత్వ విద్యా డైరెక్టరేట్, ఎన్‌డీఎమ్‌సీ విద్య విభాగ పరిధిలోని పాఠశాలల విద్యార్థుల కు నిర్వహించగా, బాల భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.

ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ (ఎన్‌సీటీ) లోని పాఠశాలలకు యూత్ పార్లమెంట్ పోటీలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ గత 60 సంవత్సరాలుగా నిర్వహిస్తోంది. ఢిల్లీ ఎన్‌సీటీ ప్రభుత్వ విద్య డైరెక్టరేట్‌తో పాటు ఎన్‌డీఎమ్‌సీ విద్య విభాగ అధికార పరిధిలోని పాఠశాలలకు యూత్ పార్లమెంట్ పోటీ కార్యక్రమంలో భాగంగా ఈ సిరీస్ లోని 58వ పోటీని 2025-26 సంవత్సరానికి గాను ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెరిటరీలో ఏర్పాటు చేశారు.

యువతరంలో స్వీయ క్రమశిక్షణ, వివిధ అభిప్రాయాలను ఆదరించడం, అభిప్రాయాలను పక్షపాత రహితంగా తెలియజేయడం, ప్రజాస్వామిక మార్గాల్లో జీవించే విధానం, తదితర సద్గుణాలను పెంపొందింప చేయడమే ఈ యూత్ పార్లమెంట్ పథకం ముఖ్యోద్దేశం. దీనికి తోడు, పార్లమెంట్ పద్ధతులు, ప్రక్రియలు, చర్చ, వాదోపవాదాల మెలకువలను విద్యార్థు లకు ఈ పథకం పరిచయం చేస్తుంది. అలాగే వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ సామర్థ్యం, చెప్పదలుచుకున్న విషయాలను ప్రభావవంతంగా చెప్పే కళ, నేర్పు.. వీటిని కూడా అలవరుస్తుంది.

# కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



మహబూబ్‌నగర్, ఆగష్టు 25: అస్సాం రాష్ట్రంలోని గువాహటిలో గల ప్రసిద్ధ కామాఖ్య అమ్మవారి ఆలయాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన కామాఖ్య అమ్మవారి సన్నిధిలో పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అమ్మవారి కృపతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు, అచ్చంపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటకం శ్రీనివాసచారి, ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆప్యాయతకు ప్రతీకగా రాఖీ

## విద్యార్థినుల ప్రేమకు సంతోషం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రామచంద్రనాయక్

నల్గొండ, ఆగష్టు 25:అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్‌కు విద్యార్థినులు రాఖీ కట్టి తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు. ఎల్లంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు చిన్నారులు ప్రేమతో రాఖీలు కట్టారు. విద్యార్థినుల ఆప్యాయతకు ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేస్తూ వారందరినీ మనసారా ఆశీర్వదించారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ కేవలం పండుగ మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధానికి, రక్షణ భావానికి ప్రతీక అని అన్నారు.

# కేటరింగ్ సేవల నాణ్యత మెరుగుదలపై ప్రయాణికుల అభిప్రాయ సేకరణ..

## వంటశాల పర్యవేక్షణ వ్యవస్థల బలోపేతానికి ఆదేశం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 25: రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని రైల్వే బోర్డు చైర్మన్(సీఆర్‌బీ)-చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) శ్రీ సతీష్ కుమార్ నిన్న ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో వార్ రూమ్ పనితీరును సమీక్షించారు. ప్రయాణిక అభిప్రాయ సేకరణ, కిచెన్ పర్యవేక్షణ, కేటరింగ్ సేవలలో నాణ్యత హామీ సంబంధిత వ్యవస్థల బలోపేతంపై ఈ సందర్భంగా ఆయన దృష్టి సారించారు.

ఇందులో భాగంగా పర్యవేక్షణ, అ2భిప్రాయ సేకరణ సంబంధిత కార్యకలాపాల కోసం ఏర్పాటైన ప్రత్యేక బృందంతో 'సీఆర్‌బీ' సంభాషించారు. పర్యవేక్షణను మరింత వేగవంతం, సాంకేతికత ఆధారితం, ఫలితాధారితం చేసే దిశగా ప్రస్తుత వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రయాణికులు ఒకే ఒక్క క్లిక్‌తో సులభంగా, సౌకర్యవంతంగా సంబంధిత వ్యవస్థతో సంభాషించేలా 'రైల్ మదద్' వినియోగ సదుపాయాన్ని మరింత స్వయంచలితం చేయాలని శ్రీ సతీష్ కుమార్ ఆదేశించారు. ప్రయాణికుల సమస్యలను మరింత సమర్థంగా అర్థం చేసుకుని పరిష్కరించే దిశగా ఫిర్యాదులను నిశితంగా పర్యవేక్షించాలని కూడా చెప్పారు. అంతేకాకుండా అవసరమైన సందర్భాల్లో ప్రయాణికులతో నేరుగా సంభాషించేలా ఏర్పాటు ఉండాలని పేర్కొన్నారు.

తనిఖీ వ్యవస్థల జవాబుదారీతనం బలోపేతం చేయడంతో పాటు ప్రతి తనిఖీ వ్యవస్థ తమ పరిశీలనలో గమనించిన లోపాలను సవివరంగా నమోదు చేయాలన్నారు. అలాగే పనితీరుపైనా విశ్లేషణ కూడా క్రమపద్ధతిలో నమోదు కావాలని సీఆర్‌బీ ఆదేశించారు. తద్వారా వారి పనితీరుపై నిరంతర పర్యవేక్షణ, మూల్యాంకనం సాధ్యం కాగలదని చెప్పారు.

రైల్వే క్యాటరింగ్ వంటశాలలకు కెమెరా ఆధారిత పర్యవేక్షణను విస్తరించడంపైనా ఈ సమీక్షలో దృష్టి సారించారు.

ప్రస్తుతం, ఈ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం 4 కెమెరా ఫీడ్‌లు అందుబాటులో ఉన్నాయి. దీన్ని మరింత విస్తృతం చేయడం ద్వారా సమర్థ నిఘా కోసం ముడి పదార్థాల నిల్వ ప్రాంతాలలో పీటీజెడ్ (పాన్-టిల్ట్-జూమ్) కెమెరా సహా అదనపు కెమెరాలను ఏర్పాటు చేయాలని సీఆర్‌బీ ఆదేశించారు.

వంటశాలల పరిస్థితిని, పనితీరును అంచనా వేయడానికి కెమెరా ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను కూడా ఉపయోగిస్తున్నారు. పరిస్థితులు సవ్యంగా లేనట్లు గమనిస్తే తగిన నోటీసు ఇచ్చి, దిద్దుబాటు చర్యలు ప్రారంభించాలి. ఈ సమీక్ష సందర్భంగా, తనిఖీ-వీడియో పర్యవేక్షణ ఆధారంగా దక్షిణ మధ్య రైల్వేలోని అనంతపురంలో గల ఒక వంటశాలలో మెరుగుదల అవసరాన్ని గుర్తించారు.

మరోవైపు రోటీ, పరాఠాల తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీనిని ప్రత్యేక సమీక్ష అవసరమైన అంశంగా గుర్తించారు.

తదనుగుణంగా లోపాలను గుర్తించి, నాణ్యతలో స్థిరత్వ నిర్ధారణ సహా వాటి తయారీ ప్రక్రియ మొత్తాన్నీ సమగ్రంగా సమీక్షించాలని ఆదేశించారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి ఏల్చూరి

**ఏల్చూరి సుబ్రహ్మణ్యం (ఆగష్టు 26, 1920 – ఫిబ్రవరి 25, 1995) ప్రసిద్ధ కవి, రచయిత, పాత్రి కేయులు. సహజ కవిగా, గొప్ప వక్తగా, ఉద్యమ ప్రవక్తగా, ప్రగతి శీల భావుకునిగా, తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు. ఆయన తెలుగు సాహిత్యంలో ప్రాముఖ్యత వహించిన అభ్యుదయ కవిత్వోద్యమ ఆద్యుల్లో ఒకరు. అభ్యుదయ కవితా యుగంలో ప్రగతిశీలస్త్ర భావ దురంధరులైన బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులుతో కూడి, ఏల్చూరి సుబ్రహ్మ ణ్యం వెలువరించిన తొలి కావ్యం నయాగరా కవితల సంపుటి. అలా ముగ్గురు అభ్యుదయ నయాగరా కవులలో ఏల్చూరి ఒకరుగా నిలిచారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు.**

ఏల్చూరి సుబ్రహ్మణ్యం ఆగష్టు 25, 1920న రామయ్య. సుబ్బాయమ్మ దంపతులకు జన్మించారు. మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ, భాగవతుల వెంకట సుబ్బారావు, అక్కిరాజు రామాపతి రావు, నాయని సుబ్బారావు తదితరుల వద్ద చిన్ననాడు విద్యా బుద్దులు నేర్చారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లోనే ఉండి, విజయవాడ యస్.ఆర్.ఆర్ కళాశాలలో బి.ఎ. డిగ్రీ చేశారు. కవి సామ్రాట్ శిష్యుడు అయిన నందమూరి తారక రామారావు తో చిన్ననాటి నుండి స్నేహం ఉంది. అలాగే కొంగర జగ్గయ్య, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ప్రాణ స్నేహితుల్లా మెదిలారు. కుందుర్తి ఆంజనే యులు, బెల్లంకొండ రామ దాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురు విద్యార్థి దశలో చదువుతున్న రోజులలో పరిచయస్తులై, తరువాతి కాలంలో "నయాగరా" కవితా సంకలనం సమ కూర్పుకు కారకులు అయినారు.

ఆగస్టు 26...ఏల్చూరి సుబ్రహ్మణ్యం జయంతి



.'త్రివేణి' ఆంగ్లపత్రిక సంపాదకులు కోలవెన్ను రామకోటేశ్వరరావు, దేశిరాజు కృష్ణశర్మ, బెల్లంకొండ రాఘవరావు, గుడిపాటి వెంకట చలం, గుఱ్ఱం జాషువాల స్ఫూర్తిని పొంది, పులుపుల శివయ్య, కొల్లా వెంకయ్యల వల్ల కమ్యూనిస్టు ఉద్యమంలో కాలూనారు. 1940 లో నరసరావుపే టలో 'సన్యాసి' అన్న పత్రికను స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, దండమూడి కేశవరావు, బెల్లంకొండ రామదాసు, దేవరకొండ బాలగంగాధర తిలక్ మొదలైన కవుల తొలి రచనలను ఆ పత్రికలో ప్రచురించారు. అదే సంవత్సరంలో 'చిత్ర' అనే పత్రికను ప్రారంభిం చారు. 1941 లో నవ్యకళా పరి షత్తును స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు, సముద్రాల రామానుజాచార్య, దేవరకొండ బాల గంగాధర తిలక్, రెంటాల గోపాలకృష్ణ మొదలైన అభ్యుదయ కవులు సభ్యులుగా కొనసాగారు. అలా ఆయా కవుల రచనలతో 1943 లో 'మాఘ్యమాల' కవితా సంపుటాన్ని వెలువరించారు. శ్రీశ్రీ కవిత్వ ప్రభావ స్ఫూర్తితో 1944 ఆగస్టులో బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురి కృషితో కవితా సంకలనం 'నయాగరా' వెలువడి అభ్యుదయ సాహిత్యోద్యమంలో అచ్చయిన తొలి కవితా సంపుటంగా నిలిచి పోయింది. అనిసెట్టి సుబ్బారావు, లక్ష్మీదేవిల పెళ్ళి కానుకగా గుంటూరులో విశ్వనాథ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కృతం అయింది.

నయాగర కవితా సంకలనంలో బెల్లంకొండ, ఏల్చూరి, కుందుర్తి ఒక్కొక్కరూ మూడేసి ఖండ కావ్యాలను రచించి 9 ఖండ కావ్యాల సంకలనంగా ప్రచురిం చారు. ఈ సంకలనంలో ...కుందుర్తి ఆంజనేయులు మూడు రచనలు... జయిస్తుంది, తరువాత, మన్యంలో; బెల్లంకొండ రామదాసువి...

చెరసాల, నా గీతం, ఈ రోజున; అలాగే ఏల్చూరి సుబ్రహ్మణ్యం సంబంధిత....ప్రజాశక్తి, ఠాగూర్ చంద్ర సింగ్, విజయ ముద్ర ఖండ కావ్యాలు చేర్చ బడ్డాయి.

1956 లో తెలుగు సాహిత్యంలో ఏల్చూరి తొలి దీర్ఘ కవిత 'నవంబరు 7' విశాలాంధ్ర పత్రికలో వెలువడింది. తల్లావఝుల శివశంకర శాస్త్రి తో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఏల్చూరి నవ్య సాహిత్య పరిషత్తు సభ్యునిగా చేరి, సమావే శాలకు హాజరయ్యారు. ప్రగతిశీల ఉద్యమాలలో పాల్గొన్నారు. వందలాది రష్యన్ కవితలను ఆంగ్ల మాధ్యమం ద్వారా అనువదించారు. నృసింహ స్వామి పై శతకం కూడా రాశారు. శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర, అబ్బూరి వరదరాజేశ్వర రావు సంయుక్తంగా రాసిన "మేమే" కావ్యాన్ని సుబ్రహ్మణ్యంకు అంకితం ఇవ్వడం విశేషం. ఆంగ్లంలో వచ్చిన వందలాది రష్యన్ కవితలను తెలుగులోకి అనువదించారు. సోవియట్ భూమి పత్రికలో సుమారు 40వేల పేజీల అనువాద రచన చేశారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతుంది. అభ్యు దయ కవిగా, అంతకు మించి కృషి పాత్రికేయుడిగా ఆయన చేసిన కృషి సాటిలేనిది.

1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అనే పత్రికను స్థాపించి, ప్రముఖ కవుల రచనలు ప్రచురించారు. పొగాకు లోకం' (గుంటూరు) పత్రిక సంపాదకులుగా, 1941 – 42లో ఆంధ్ర సర్వస్వము సహాయ సంపాదకునిగా, 1954–56లో ఆకాశ వాణిలో స్క్రిప్టు రైటరుగా... రాయప్రోలు రాజశేఖర్, జలసూత్రం రుక్మిణనాథశాస్త్రి లతో కలిసి ఆకాశవాణికి ఎన్నో స్క్రిప్ట్ లందించారు. మద్రాస్‌లో సినిమా లకు పాటలు కూడా రాశారు. 1952లో సోషలిస్టు పత్రికలో, 1956లోనేత' పత్రిక సంపాద కులుగా, 1961–1988లో సోవియట్ భూమి పత్రిక సంపాదక వర్గంలో, తర్వాత మద్రాసులో అభ్యుదయ పత్రిక నిర్వాహకసభ్యునిగా పని చేశారు. ప్రముఖ వేణుగాన విద్వాంసులు ఏల్చూరి విజయ రాఘవరావు ఆయన సోదరులు కాగా, సాహితీవేత్త ఏల్చూరి మురళీధరరావు ఆయన కుమారుడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## తాగునీటి ట్యాంకులు, ఫిల్టర్ల స్వచ్ఛత, సూక్ష్మక్రిముల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాన్ని మొదలు పెట్టిన భారతీయ రైల్వే

న్యూఢిల్లీ, ఆగష్టు 25:రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు సురక్షిత, స్వచ్ఛ తాగునీరు అన్ని వేళలా అందుబాటులో ఉండేటట్లు చూడటానికి తాగునీటి ట్యాంకులను, వడపోత వ్యవస్థలను శుభ్రపరచడం, క్రిమినిర్మూలన దిశగా దృష్టి పెట్టే ఒక ప్రత్యేక స్వచ్ఛత పరిరక్షణ ఉద్యమాన్ని భారతీయ రైల్వే మొదలుపెట్టింది.

తాగునీటి నాణ్యత నిర్వహణను పటిష్ఠం చేసేందుకు భారతీయ రైల్వేల ఆధ్వర్యంలో అమలుపరుస్తున్న ఒక విస్తృత కార్య ప్రణాళికలో ఈ కార్యక్రమం ఓ భాగం. ఈ కార్యాచరణ ప్రణాళికలో.. పూర్తి తాగునీటి వ్యవస్థను తరచు తనిఖీ చేస్తుండడంతో పాటు, ఆ వ్యవస్థ నిర్వహణ విషయంలో శ్రద్ధ వహించనున్నారు. ఒక్క నల్లా నీటిని పరీక్షించడానికే పరిమితం కాకుండా, జల మూలం వద్ద, పంపుల వద్ద కూడా నీటి నాణ్యతను పరీక్షించాలని ఈ కార్యాచరణ ప్రణాళికలో స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, నీటి వనరులు, శుద్ధి ప్లాంటులు, వడపోత ప్లాంటులు, భూమి లోపలి ట్యాంకులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పీవీసీ ట్యాంకులు, వాటర్ బూత్‌లు, నల్లాలు, నీటిని అందించే స్థలాల వద్ద కూడా ముమ్మర పరిశీలనలను జోనల్ రైల్వేలు చేపడతాయి. అన్ని తాగునీటి ట్యాంకుల్నీ ఖాళీ చేసి, బురదను బయటకు తీసి, ట్యాంకులను లోపల నుంచి శుభ్రపరిచి, వ్యాధికారక క్రిమికీటకాలు, సూక్ష్మజీవుల లేకుండా చూస్తారు. దీనికి అదనంగా, నీరు బయటకు పోయేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు, ట్యాంకు నిండాక నీరు బయటకు పొంగి పొరలే చోట్ల వద్ద పక్షుల, పశువుల సంచారం, చెత్త పేరుకుపోవడం, నాచు పెరగడం వంటి సమస్యల నుంచి తగిన రక్షణ కోసం కట్టుదిట్టమైన మూతలను ఏర్పాటు చేసేందుకు కూడా చొరవ తీసుకుంటారు.

ఈ ప్రత్యేక స్వచ్ఛత పరిరక్షణ ఉద్యమ కాలంలో తీసుకోవాల్సిన దిద్దుబాటు చర్యలను నిశితంగా పరిశీలించి గుర్తిస్తారు. పాడైన ట్యాంకులు, గొట్టపు మార్గాలు, ఫిల్టర్లను మరమ్మతు చేయడమో, లేదా అవసరాన్ని బట్టి వాటిని మార్చడమో చేస్తారు. వీటితోపాటు తాగడానికి అనువైన, తాగడానికి అనువు గాని జల వ్యవస్థల మధ్య ఎలాంటి క్రాస్–కనెక్షన్ ఏర్పడకుండా చూస్తారు. తాగునీటి వ్యవస్థలో భాగంగా ఉన్న అన్ని గొట్టాలు చిల్లులేమైనా పడి కారుతున్నాయా అన్నది సరి చూస్తారు. నీరు వృథాపోకుండా నివారించడానికి అవసరమయ్యే దిద్దుబాటు చర్యలను తీసుకుంటారు.

తాగునీటిని బయటకు తోడటానికి చేతి పంపులను, బోర్‌వెల్స్‌ను ఉపయోగిస్తున్న స్థలాల వద్ద ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తారు. ఈ వ్యవస్థల వద్ద నీరు కలుషితం కాకుండా తాగడానికి ఉపయోగపడేదిగా ఉండేటట్లుగా జోనల్ రైల్వే బాధ్యత తీసుకుని పనిచేయవలసి ఉంటుంది.

ఒక విస్తృత కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వాటర్ కూలర్లను, నీటి శుద్ధి వ్యవస్థలను సమగ్రంగా తనిఖీ చేస్తూ ఉండాల్సిందిగా జోనల్ రైల్వేలకు రైల్వో బోర్డు సలహాను ఇచ్చింది. కూలర్లలోని నీళ్ల ట్యాంకులను బాగా శుభ్రపరిచి, కూలర్లు, గొట్టపుమార్గాలు, నల్లాల్లో లీకేజీలు ఉంటే వాటిని వెంటనే సరి చేస్తారు. వాటర్ కూలర్ చుట్టూరా ఉండే ప్రదేశాలు శుభ్రంగా ఉండేటట్లు చూస్తారు.

వాటర్ కూలర్ల కోసం యూవీ/ఆర్‌ఓ శుద్ధీకరణ వ్యవస్థలను తనిఖీ చేస్తూ అవి సరిగ్గా పనిచేస్తున్నదీ లేనిదీ పరిశీలించి, అవసరాలను బట్టి తగు చర్య తీసుకుంటారు. ఎక్కడైనా పాడైపోయిన దాఖలాలు కనపడితే తదనుగుణంగా అక్కడ నిర్వహణ, సర్వీసింగ్, మరమ్మతు, ఫిల్టర్ క్యాండిల్స్, ఇతర విడిభాగాలను ఎప్పటికప్పుడు నెలకొల్పుతారు. కొత్త, లేదా మార్చవలసిన అవసరం ఉండే యూవీ/ఆర్‌ఓ వ్యవస్థలను వాటి స్థితి, అవసరాల ఆధారంగా వెనువెంటనే సమకూరుస్తారు.

వాటర్ వెండింగ్ మెషిన్ల వద్ద కూడా పరిశుభ్రపరిచే పనులను, శుద్ధి, నాణ్యత పర్యవేక్షణలకు సంబంధించిన పనులను చేపడుతుంటారు. ఆ తరహా సదుపాయాల నుంచి సరఫరా అయ్యే తాగునీరు సురక్షితంగా, స్వచ్ఛత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేటట్లు చూస్తారు.

నిర్దేశిత ప్రదేశాల్లో జల నమూనాలను అధికారులు సేకరించి భౌతిక, రసాయనిక, బాక్టీరియాకు సంబంధించిన పరీక్షలను చేపడతారు. నీటి మూలాలు, శుద్ధి అనంతరం నీటిని అందజేసే వ్యవస్థలు, ట్యాంకులు, కూలర్లు, నీటి విక్రయ యంత్రాలు, నల్లాలు, వాటర్ బూత్‌ల నుంచి కూడా నమూనాలను సేకరిస్తారు. మిగిలిపోయే క్లోరిన్‌ను కూడా ప్రతిరోజూ పరిశీలిస్తారు. అవసరమైనప్పుడు వెనువెంటనే తిరిగి క్లోరిన్‌ను వినియోగించడం గాని, లేదా ఇతర దిద్దుబాటు చర్యలను గాని చేపడతారు.

మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, దిద్దుబాటు చర్యలు

కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకులు, భూగర్భ ట్యాంకుల నిర్మాణం, లేదా పాతబడ్డ వాటిని మార్చడానికి అనుమతించిన చోట్ల అందుకు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తూ, ఆ పనులను త్వరగా పూర్తి చేసేటట్లు చూడాల్సిందిగా జోనల్ రైల్వేలను రైల్వే బోర్డు ఆదేశించింది. ఆమోద ముద్ర వేసిన పనులు ఎంతవరకు వచ్చిందీ నివేదికను రూపొందించడంతో పాటు, అవసరమనుకున్న చోట్ల తాజాగా పనులకు అనుమతిని ఇచ్చే ప్రక్రియను మొదలుపెడతారు.

తాగునీటి సరఫరా వ్యవస్థ వివిధ దశల్లో కాలుష్య కారకాలను గుర్తింపు, నివారించడానికి మూలాలు, నల్లాలు సహా వివిధ పరిస్థితులకు తగినట్లుగా వడపోత, శుద్ధీకరణలకు ఏర్పాట్లు చేయడంపైనా కసరత్తు జరుగుతోంది. జోనల్ రైల్వేలు తాము గుర్తించిన లోపాలు, వాటిని దృష్టిలో పెట్టుకొని చేపట్టిన దిద్దుబాటు చర్యలపై స్టేషన్‌వారీ వివరాలను అందిస్తాయి. లోటుపాట్లను వ్యవస్థాగతంగా పర్యవేక్షించడానికి మార్గాన్ని ఈ యంత్రాంగం సుగమం చేస్తుంది. అంతే కాక, ప్రత్యేక కార్యక్రమాల వేళ పసిగట్టిన సమస్యలను కాలబద్ధ పద్ధతిలో పరిష్కరించడానికి కూడా ఇది తోడ్పడుతుంది. కార్యాచరణ ప్రణాళికలో రైల్వే కాలనీలు, పని ప్రదేశాల్లో తాగునీటి మౌలిక సదుపాయాలను దృష్టిలో పెట్టుకొని ఇదే విధమైన చర్యలను తీసుకోవాలని సంకల్పించారు. దీంతో ఒక్క ప్రయాణికులతో సంబంధం ఉండే ప్రాంతాలనే కాకుండా, ఇతర చోట్ల కూడా సురక్షిత, స్వచ్ఛ తాగునీటిని అందజేసే విషయంలో శ్రద్ధ వహించినట్లు అవుతుంది.

ఈ సమష్టి చర్యలను తీసుకోవడం ద్వారా, భారతీయ రైల్వేలకు సంబంధించిన తాగునీటి సరఫరా వ్యవస్థ అంతటా నివారణ ప్రధాన తనిఖీలు, మౌలిక సదుపాయాల నిర్వహణ, స్వచ్ఛత, వ్యాధికారక క్రిమికీటకాలు, సూక్ష్మజీవులను నశింపచేసే పద్ధతి, నీటి నాణ్యతను నిర్ధారించే పరీక్షలను, దిద్దుబాటు చర్యలను తీసుకొనే దిశగా పక్కా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రయాణికులకు, అలాగే రైల్వే సిబ్బందికి సురక్షిత, స్వచ్ఛ, ఆరోగ్యవర్ధక తాగునీరు ఎల్ల వేళలా అందుబాటులో ఉండేటట్లు చూడడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం.

## ధర్పల్లి చెరువులో దూకిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్ నరేందర్

నిజామాబాద్, ఆగష్టు 25: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించడంతో వారు వచ్చి కాపాడారు. ఈ ఘటన ధర్పల్లి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ధర్పల్లి మండల కేంద్రంలోని ఔఖీ కాలనీకి చెందిన మందుల గణేష్ కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది, చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు.

ఈ విషయం 100 డయల్‌కు సమాచారం అందడంతో వెంటనే పోలీసు సిబ్బంది స్పందించారు. సమాచారం తెలుసుకున్న ధర్పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నరేందర్ వెంటనే చెరువు వద్దకు చేరుకుని, ప్రాణాపాయ స్థితిలో చెరువులో ఉన్న గణేష్‌ను గుర్తించి, చెరువులోకి దిగి అతడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు. కానిస్టేబుల్ నరేందర్ సమయస్ఫూర్తితో స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడినందుకు పోలీసు అధికారులు ఆయనను అభినందించారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : డీఐఈవో వెంకటేశ్వర్లు

ఖమ్మం, ఆగష్టు 25: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి (డీఐఈవో) వెంకటేశ్వర్లు అన్నారు.

బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చిన్నా అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు డీఐఈవోకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కళాశాల అభివృద్ధి, విద్యాప్రమాణాలపై డీఐఈవో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి అందిస్తున్న నోట్‌బుక్స్, టెక్ట్స్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, షూష్‌ను స్వయంగా విద్యార్థులకు పంపిణీ చేశారు.

అకడమిక్ రికార్డులు, రిజిస్టర్లు, విద్యార్థుల అభ్యసన ప్రగతి రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి అధ్యాపకులకు పలు సూచనలు చేశారు.

అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో డీఐఈవో ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, నాటిన మొక్కలను సంరక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఎన్ఎస్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో శ్రీనివాస్, పీవీఎస్‌ఎన్ మూర్తి, కొండా ముకుందం, లైబ్రరీ టీచర్ పద్మావతి, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లు, ప్రదీప్, సరస్వతి, నరేశ్, సాహితీ, దివ్య, నాన్ టీచింగ్ స్టాఫ్ ఉమ, ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## జూలూరుపాడులో ఘనంగా వన మహోత్సవం

ఖమ్మం, ఆగష్టు 25: పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో జూలూరుపాడు మండలంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించారు.

ండలంలోని మొత్తం 24 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాలు, పాఠశాలల ప్రాంగణాల్లో పంచాయతీకి 200 చొప్పున విస్తృతంగా మొక్కలు నాటారు. పాపకొల్లు?కొత్తూరు అలాగే జూలూరుపాడు గ్రామ పంచాయతీల పరిధిలోని ఏవెన్యూ ప్లాంటేషన్‌లో చేపట్టిన కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, మహావృక్షంగా ఎదిగేలా చూడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరామ్, ఏపీఓ రామారావు, టీఏ నాగమణి, ఎఫ్ఏ షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా యూరియా పంపిణీ

### తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు: సొసైటీ చైర్మన్ బంగ్లా దేవేందర్



నిజామాబాద్, ఆగష్టు 25:మండలంలోని ముచ్కూర్ సొసైటీ పరిధిలో రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తున్నామని సొసైటీ చైర్మన్ బంగ్లా దేవేందర్ తెలిపారు. ముచ్కూర్ సొసైటీ పరిధిలోని ముచ్కూర్, గోనుగొప్పుల, పల్లికొండ గోదాముల ద్వారా యూరియా పంపిణీ చేపడుతున్నట్లు చెప్పారు. పంపిణీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 28 లారీల యూరియా అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఒక్కో లోడ్‌లో 450 సంచుల చొప్పున కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు ప్రాధాన్యత క్రమంలో పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

ప్రస్తుతం ముచ్కూర్, పల్లికొండ గోదాముల్లో 450 సంచుల చొప్పున మొత్తం 900 సంచుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యాప్‌లో నమోదు చేసుకున్న రైతుల ఆధార్, బుకింగ్ వివరాలను పరిశీలించి నిబంధనల మేరకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందేలా నిల్వలు, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తూ రైతుల్లో అయోమయం సృష్టిస్తున్నారని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకుండా యూరియా పంపిణీ వివరాల కోసం సొసైటీ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు.

## 'హరిత గ్రామాలే లక్ష్యంగా వన మహోత్సవం'

### ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు



ఖమ్మం, ఆగష్టు 25: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎర్రుపాలెం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బండారు నరసింహారావు మాట్లాడుతూ.. మొక్కలు నాటడం కార్యక్రమాన్ని ఒకరోజుకే పరిమితం చేయకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు.

ప్రతి గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

మొక్కను నాటడం కంటే దాన్ని సంరక్షించడమే ముఖ్యమని, నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా పెంచితేనే వనమహోత్సవం కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రతి కుటుంబం కనీసం కొన్ని మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. మొక్క నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. మన గ్రామాలను పచ్చదనంతో నింపుదాం. హరిత గ్రామాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.